ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

తూర్పుగోదావరి జిల్లా వార్తలు

మంగళవారం 28 అక్టోబరు 2025 | 5







కడియపులంకలోని అనంతేశ్వరుడికి అభిషేకం

అంతటా వాన



రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో సోమవారం జిల్లావ్యాప్తంగా 19 మండలలో 15.1 సెం.మీ వర్షపాతం నమోదైంది. ఉదయం 8 నుంచి సాయంత్రం 5:30 గంటల మధ్య జిల్లాలో అత్యధికంగా రాజానగరంలో 15.8 మి.మీ వర్షం కురిసింది. బిక్కవోలు మండలంలో 14.4, పెరవలిలో 13.8, అనపర్తిలో 13.2, రంగంపేటలో 12.0, ఉండ్రాజవరంలో 10.4, రాజమహేంద్రవరం రూరల్‌లో 10.2, కడియంలో 9.2, నిడదవోలులో 8.2, కోరుకొండలో 7.8, కొవ్వూరులో 6.2, రాజమహేంద్రవరంలో 5.4, చాగల్లులో 5.2, గోకవరంలో 5.0, గోపాలపురంలో 4.2, సీతానగరంలో 3.2 ,నల్లజర్లలో 3.0, దేవరపల్లిలో 2.2, తాళ్ళపూడి లో 2.2 మి.మీల వర్షపాతం నమోదైంది. జి ల్లా మొత్తం వర్షపాతం 8.0 శాతంగా ఉంది.

హర హర మహాదేవ



రాజమహేంద్రవరం పుష్కరఘాట్‌లో భక్తులు

హరహర మహాదేవ శంభో శంకర అంటూ భక్తులు కొలిచారు.. కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా సోమవారం వేకువజామున 3 గంటల నుంచి గోదావరి రేవులకు భక్తజనం పోటెత్తారు.స్నానాలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. దీపాలను నదిలో విడిచి దీపదానాలు, శాలిగ్రామ, స్వయం పాక దానాలు చేశారు. - రాజమహేంద్రవరం సిటీ

మొత్తమొంథా.. అలజడి!



ముంచుకొస్తోంది : ఉప్పాడ కొత్తపల్లి వద్ద సముద్రం

ఉప్పాడ వద్ద కల్లోల తీరం..



సురక్షిత ప్రాంతాలకు : కాట్రేనికోన వద్ద మత్స్యకారుల తరలింపు

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

మొంథా తుఫాన్ ముంచుకొస్తోంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో రెండు రోజులుగా కొనసాగుతున్న వాయుగుండం ఆదివారం అర్ధరాత్రి తర్వాత తుఫాన్‌గా బలపడింది. ఈ క్రమంలో ఉత్తర వాయువ్యంగా పయనించి నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ప్రవేశించింది. సోమవారం మధ్యాహ్నం సమయానికి కాకినాడకు 490 కి.మీ వద్ద తుఫాన్ కేంద్రీకృతమై ఉంది. సోమవారం ఉదయం నుంచి గంటకు 17 కి.మీ. వేగంతో ప్రయాణిస్తోంది. అదే వేగంతో పయనించి మంగళవారం సాయంత్రం లేదా రాత్రికి మచిలీపట్నం-విజయనగరం మధ్య కాకినాడ వద్ద తీరం దాటుతుందని భారతవాతావరణ శాఖ తెలిపింది. అయితే తీవ్ర తుఫాన్ కాకినాడ-యానాం మధ్య తీరం దాటే అవకాశం ఉందని ఇస్రో వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

ఈ రాత్రి గడిస్తే చాలు

1996 నవంబరు 6న రాత్రి ఒక్కసారిగా తుఫాన్ వచ్చింది.. కోనసీమను తుడిచిపెట్టేసింది.. మొంథా తుఫాన్ మంగళవారం రాత్రి కాకినాడ వద్ద తీరం దాటుతుందని అంచనా. దీంతో ఉమ్మడి జిల్లాలో ప్రతి ఒక్కరూ ఈ రాత్రి గడిస్తే చాలనుకుంటున్నారు..

సీఎం, డిప్యూటీ సీఎం సమీక్షలు..

ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా కాకినాడ, కోనసీమ జిల్లాల తీరప్రాంతాల్లో తుఫాన్ బీభత్సం అధికంగా ఉండనున్నందున ఈ ఇద్దరి కలెక్టర్లతో సీఎం చంద్రబాబు తరచూ సమీక్షలు నిర్వహిస్తు న్నారు. బాధితులకు ఏ ఇబ్బంది కలగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని సూ చించారు. కాకినాడ జిల్లాలో పునరావాస శిబిరాలకు వెళ్లినచోట ప్రజల ఇళ్లకు ఇబ్బందులు లేకుండా గస్తీ పెంచాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశించారు. అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు ప్రజలకు అందుబాటులో ఉండి సహాయక చర్యలు ముమ్మరం అయ్యేలా చూడాలని మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు.

రోజంతా ఒక్కటే వాన..

తుఫాన్ ప్రభావంతో సోమవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో పలు చోట్ల భారీ వర్షాలు పడగా.. రాత్రి నుంచి వర్షాల తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. తుఫాన్ మంగళవారం అర్ధరాత్రికి తీరం దాటనుండడంతో మంగళవారం నుంచి పెనుగాలులు అధికంగా ఉంటాయని ..అత్యవసరమైతే తప్ప ప్రజలెవరూ బయటకు రావొద్దని అధికారులు హెచ్చరించారు. తుఫాన్ ధాటికి చెరువులు, రిజర్వాయర్లు, కాలువలు పొంగిపొర్లుతున్నాయి. అనేక చోట్ల గండ్లు పడే ప్రమాదం ఉండడంతో జలవనరుల శాఖ అధికారులు ఇసుక బస్తాలు సిద్ధం చేశారు. విద్యుత్‌శాఖ విద్యుత్ సరఫరాలో అంతరాయాలను సరిదిద్దడానికి వీలుగా అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

దూసుకొస్తున్న తుఫాన్

- వణుకుతున్న ఉమ్మడి జిల్లాలు
- ఇప్పటికే భారీ వర్షాలు.. గాలులు
- అల్లకల్లోలంగా మారిన తీరం
- కాకినాడ - యానాం మధ్య హైఅలర్ట్
- తీరం దాటుతుందన్న సంకేతాలు
- పోర్టులో ఏడో నెంబరు హెచ్చరిక
- పలు రైళ్లు, విమానాలు రద్దు
- సీఎం, డిప్యూటీ సీఎం సమీక్షలు

గంటకు వేగం 100 కి.మీ..

గాలుల తీవ్రత మంగళవారం సాయంత్రానికి గంటకు 100 కిలోమీటర్ల వరకు ఉంటాయన్న హెచ్చరికలు ప్రజల్లో వణుకుపుట్టిస్తున్నాయి. మరో వైపు సోమవారం రాత్రి కాకినాడ పోర్టులో ఏడో నెంబరు ప్రమాద హెచ్చరిక ఎగుర వేశారు. హుద్‌హుద్ తుఫాన్ తర్వాత మళ్లీ ఆ స్థాయిలో ప్రమాద హెచ్చరికలు జారీ అవడం తుఫాన్ తీవ్రతను చాటుతోంది. సామర్లకోట,రాజమహేంద్రవరం మీదుగా వెళ్లే పలు రైళ్లను రద్దు చేశారు.రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి వెళ్లే పలు విమానాలు రద్దుచేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని బీచ్‌లకు వెళ్లే అన్ని రహదారులు మూసివేశారు.

కాకినాడలో 269 పునరావాస కేంద్రాలు

కాకినాడ జిల్లాలో 12 తుఫాన్ ప్రభావిత మండలాల్లో 269 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ స్వయంగా అధికారులతో కలిసి ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు.జిల్లాలో 3.35 లక్షల మందిపై తుఫాన్ ప్రభావం చూపుతుందని గుర్తించారు. నిత్యావసరాలు తగిన ప్రదేశాల్లో ఉంచేలా పౌరసరఫరాలశాఖ ఏర్పాట్లు చేసింది. విద్యుత్,ఫైర్ సిబ్బందిని అందుబాటులో ఉంచారు. కాకినాడ జిల్లాలో తుఫాన్ తీరం దాటుతుందన్న సమాచారంతో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నారాయణ సోమవారం అధికారులను అప్రమత్తం చేశారు.

కోనసీమలో 90 కి.మీ తీరం

కోనసీమ జిల్లాకు రెండు ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు చేరుకున్నాయి. తుఫాన్ సహాయక, పునరావాస చర్యలపై ప్రత్యేకాధికారిగా నియమితులైన విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మహేష్‌కుమార్, జేసీ నిషాంతి పరిశీలించారు. జిల్లా పరిధిలో సుమారు 90 కి.మీ తీర ప్రాంతం ఉండగా 120 పునరావాస కేంద్రాల్లోకి ఆరు వేల మందిని తరలించేలా ఏర్పాట్లు చేశారు. సఖినేటిపల్లి-నరసాపురం మధ్య పంటు రాకపోకలు నిలిపివేశారు.

తూర్పున యంత్రాగం అప్రమత్తం

తుఫాన్ హెచ్చరికలతో తూర్పుగోదావరి జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం జిల్లాకు చేరుకుంది. ముఖ్యంగా విపత్తు నిర్వహణ శాఖ, పోలీస్, రెవెన్యూ పునారావాస, భద్రత తదితర ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్ రాజమహేంద్రవరం చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మంత్రి దుర్గేష్ కంట్రోల్ రూమ్‌లను పరిశీలించారు. తుఫాన్ జిల్లా ప్రత్యేక అధికారిగా నియమించిన కె.కన్నబాబు నిడదవోలులో పర్యటించారు.

అధికారులు 24 గంటలు అందుబాటులో ఉండాలి

మంత్రి దుర్గేష్ ఆదేశం



మద్దూరు పునరావాస కేంద్రంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్ చిత్రంలో ఆర్డీవో రాణిసుస్మిత

నిడదవోలు/కొవ్వూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ దృష్ట్యా అధికారులు, గ్రామ సచివాలయాల సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలని మంత్రి దుర్గేష్ ఆదేశించారు. ముంబయి పర్యటన రద్దు చేసుకుని సోమవారం రాత్రి రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టులో దిగిన మంత్రి దుర్గేష్ నేరుగా నిడదవోలు నియోజకవర్గానికి చేరుకుని ఉండ్రాజవరం, పెరవలి, నిడదవోలులో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లను పరిశీలించారు.కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. తుఫాన్ ఎదుర్కొనేందుకు యంత్రాంగం అన్ని విధాలా సిద్ధంగా ఉండాలన్నారు. ఆర్డీవో రాణి సుస్మిత నుంచి డివిజన్‌లోని 9 మండలాలకు సంబంధించి వివరాలు అడిగితెలుసుకున్నారు. మద్దూరులో పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట తహశీల్దార్ బి.నాగరాజు నాయక్,ఎంపీడీవో జగన్నాథరావు పాల్గొన్నారు.





కంసాలిపాలెం వద్ద ఎర్రకాలువ పరీవాహక ప్రాంతాలను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేక అధికారి కన్నబాబు

సమన్వయంతో పని చేయండి

- తుఫాన్‌పై ఆందోళన వద్దు
- ఎక్కడైనా సమస్య ఉంటే చెప్పండి
- కంసాలిపాలెం దారి బంద్
- జిల్లా ప్రత్యేకాధికారి కన్నబాబు

నిడదవోలు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మొంథా తుఫాన్ ప్రభావం దృష్ట్యా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా సహాయక చర్యల ప్రత్యేక అధికారి ఏపీ సీఆర్‌డీఏ కమిషనర్ కె.కన్నబాబు ఆదేశించారు. నిడదవోలు మండలం కంసాలిపాలెం ఎర్రకాలువ పరివాహక ప్రాంతాన్ని సోమవారం పరిశీలించి మాట్లాడారు. తుఫాన్ సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. తుఫాన్ ప్రభావం తగ్గే వరకు సహాయక చర్యలు పర్యవేక్షిస్తామన్నారు. అధికార యంత్రాంగం 24 గంటలు పనిచేస్తుందన్నారు. ఎక్కడ సమస్యలు తలెత్తినా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఎర్రకాలువ ప్రవాహం ప్రస్తుతం పూర్తి నియంత్రణలోనే ఉందని ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మంత్రి కందుల దుర్గేష్ సూచనలతో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరితో సమన్వయం చేసుకుంటూ లోతట్టు,ఎర్రకాలువ పరిసర ప్రాంతాల్లో పర్యటించామన్నారు. ప్రస్తుతం 2 వేల క్యూసెక్కుల నీరు మాత్రమే ప్రవహిస్తుందన్నారు. ఎర్రకాలువ ప్రవాహ ఉధృతి కారణంగా తూర్పుగోదావరి జిల్లా కంసాలిపాలెం, పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం మాధవరం మధ్య ఉన్న రహదారి రాకపోకలు బంద్ చేశారు.ఆయన వెంటఆర్డీవో రాణి సుస్మిత, చైర్మన్ భూపతి ఆదినారాయణ,కమిషనర్ తోట కృష్ణవేణి ఉన్నారు.

ఏపీ స్టార్స్‌కు అనుమతుల్లో జాప్యం : రాహుల్

రాజమహేంద్రవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారడం, బడ్జెట్ పరిమితులు, సాంకేతిక అనుమతుల్లో జాప్యం కారణంగా ఏపీ స్టార్స్ నిర్మాణం తాత్కాలికంగా ఆగిపోయిందని సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ స్పష్టం చేశారు. 'ఏదీ ఏపీ స్టార్స్' శీర్షికన ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన కథనంపై అయన ఒక ప్రకటనలో స్పందించారు. అకాడమీ నిర్మాణానికి సమగ్ర ప్రణాళిక, ఆర్కిటెక్చర్ డిజైన్, ప్రభుత్వ ఆమోదం ప్రక్రియ జరుగుతోందన్నారు. సంబంధిత ఫైలు ఇంకా సమీక్ష దశలో ఉందనడం కొసమెరుపు. శిలాఫలకం వేసి ఈ నవంబరు 15కి రెండేళ్లు పూర్తవుతున్నా పనులు ఎప్పుడు ప్రారంభిస్తారనే విషయం రహస్యంగానే ఉంచారు.



భారీ హోర్డింగ్‌లు తొలగిస్తున్న పోలీసులు

రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్

మేం వచ్చేశాం.. భయపడొద్దు!

జిల్లాకు చేరుకున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు

రాజమహేంద్రవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికలతో యంత్రాంగం అప్రమత్తమైంది. ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం జిల్లాకు చేరుకుంది. ముఖ్యంగా విపత్తు నిర్వహణ శాఖ, పోలీస్, రెవెన్యూ పునారావాస, భద్రత తదితర ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్ రాజమహేంద్రవరం చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. జిల్లాలోని భద్రత ఏర్పాట్లను ఎస్పీ నరసింహ కిశోర్ వివరించారు. పలు హోర్డింగ్‌లు, బ్యానర్లు, ఫ్లెక్సీలను తొలగించారు. పోలీస్ కంట్రోల్ రూమ్‌లో ప్రత్యేక బృందాల ద్వారా గమనిస్తున్నామన్నారు. పోలీస్ స్టేషన్ల పరిధిలో గస్తీ ముమ్మరం చేశామన్నారు. విపత్తు నిర్వహణ శాఖ 16 ప్రత్యేక బృందాలను, సరంజామాను సిద్ధం చేసింది. చెట్లు విరిగి రోడ్లపై పడితే వెంటనే కట్ చేయడానికి పవర్ రంపాలు అందుబాటులో ఉంచారు. ప్రాంతీయ ఫైర్ అధికారి ఈ.స్వామి కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాలోని పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. జిల్లాకు రాష్ట్ర విపత్తు నిర్వహణ దళం(ఎస్‌డీఆర్‌ఎఫ్) 33 మంది విపత్తు నిర్వహణకు అవసరమైన సామగ్రితో జిల్లాకు చేరుకుని రాజమహేంద్రవరం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో బస చేశారు. ఏ క్షణంలో అయినా జిల్లాలోని ఎక్కడికైనా వెళ్లడానికి వీలుగా వాహనాలతో సన్నద్ధంగా ఉన్నారు.అవసరమైతే లంకలు, లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తామని తహశీల్దార్ పాపారావు తెలిపారు. రైల్వే స్టేషన్‌లో రైళ్ల రద్దు సమాచారం అందించడానికి హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు.

అన్నదాత గుండెల్లో తుఫాన్!



- చివరికి అన్నదాతకు కష్టాలు
- మొంథా హెచ్చరికలతో ఆందోళన
- 8 మండలాల్లో వరి పంటకు నష్టం

(రాజమహేంద్రవరం/పెరవలి/రాజానగరం/ కడియం /గోకవరం -ఆంధ్రజ్యోతి)

ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తున్న అన్నదాతలకు ప్రకృతి వైపరీత్యాల భయం వెంటాడుతోంది. మరో వారం రోజుల్లో పంట కోత కోసి చేతికొస్తుందనుకొన్న తరుణంలో మొంథా తుఫాన్ హెచ్చరికలతో రైతులు దిక్కు తోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలతో పంట నేలకొరిగింది. దీంతో చాలా వరకు పంట గింజ పాలు పోసుకోక, తాలుగింజలు ఏర్పడే ప్రమాదం ఉందని, దీంతో పంట దిగుబడి తగ్గుతుందని రైతులు వాపోతున్నారు.ప్రతి ఏడాది ఏదో రీతిలో ప్రకృతి ప్రకోపానికి గురవుతున్నామంటూ అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. ఇప్పటి వరకూ 8 మండలాల్లో 545 మంది రైతులకు నష్టం వాటిల్లినట్టు సమాచారం. కడియం మండల వ్యవసాయాధికారి పీవీ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుతం 100 హెక్టార్లలో వరికోతకు పంట సిద్ధంగా ఉందని వర్షం తగ్గిన తరువాత పంట కోత కోసుకోవాలని రైతులకు సూచించారు. రాజానగరం మండలంలో 7 వేల ఎకరాల్లో వరి కోతలు కోయాల్సి ఉందని వ్యవసాయాధికారి ఎ.కళ్యాణ్ సూర్యకుమార్ తెలిపారు.. జిల్లావ్యాప్తంగా 1.62 లక్షల ఎకరాల్లో సాగు చేస్తున్న ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎన్.మల్లిఖార్జునరావు తెలిపారు.

తప్పని హర్రీ.. వర్రీ..

తూర్పుగోదావరి జిల్లాలో 52,929 హెక్టార్లలో వరి సాగు చేశారు.భారీ వర్షాల వల్ల ఇప్పటికే 12 మండలాల పరిధిలో 3569.2 హెక్టార్లలో పంట ఒరిగిపోయింది. ఇప్పటికే 105 గ్రామాల్లో 5207 మంది రైతులకు చెందిన 384.29 హెక్టార్లలో వరికి నష్టం వాటిల్లింది. ఇప్పటి వరకూ 4483 ఎకరాల్లో మాసూళ్లు పూర్తయ్యాయి. మాసూళ్లకు సిద్ధంగా 12,157 ఎకరాల పంట ఉంది. గింజ గట్టిపడే దశలో 1, 53,149 ఎకరాల్లో పంట ఉంది. ఇక పూత, భయాందోళన పరిస్థితిలో 21,751 ఎకరాలలో పంట ఉంది.భారీ వర్షాలు పడితే ఈపంటకు తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉంది.

పంట పడిపోతే.. నిలగట్టుకోవాలి : చల్లా



అనపర్తి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : వరి పంటను కాపాడుకునేందుకు రైతులు జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు సూచించారు. అనపర్తి ఏడీఏ కృష్ణతో కలిసి సోమవారం అనపర్తి, బిక్కవోలు మండలాల్లోని పలు గ్రామాల్లో పంటను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ప్రస్తుతం పంట ఎక్కువ శాతం గింజ తోడుకునే, గట్టిపడే పరిస్థితిలో పంట ఉందని ఈ దశలో బరువు ఎక్కువగా ఉండడంతో మొక్కలు కొద్దిపాటి గాలికే వెన్ను విరిగి నేలకు ఒరుగుతాయన్నారు.దీని వల్ల పిండి పదార్థం పూర్తిగా గింజలకు చేరక గింజ బరువు తగ్గడం లేదా తాలుగింజలు ఏర్పడి దిగుబడి తగ్గుతుందన్నారు.పడిన చేలలో ధాన్యం రంగు మారుతుందన్నారు.తుఫాన్ ముప్పు తొలగిన వెంటనే నీరు పోయే మార్గం ఏర్పాటు చేసుకుని.. పడిన పంట నిలగట్టుకోవాలని రైతులకు సూచించారు.ఐదు శాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని సూచించారు.

జిల్లా వ్యాప్తంగా నేలకొరిగింది..

- రాజమహేంద్రవరం మండల పరిధిలోని 7 గ్రామాలు రాజవోలు,బొమ్మూరు, ధవళేశ్వరం,హుకుంపేట,కోలమూరు, వెంకట నగర్,కాతేరు ప్రాంతాల్లో 63 మంది రైతులకు చెందిన 40 హెక్టార్లలో పంట ఒరిగిపోగా 5 హెక్టార్లలో నష్టం వాటిల్లింది.
- రాజానగరం మండలం ముక్కి నాడ, రాజానగరం,నరేంద్రపురం,కలవచర్ల, జి.యర్రంపాలెం, పల్లకడియం, వెలుగుబంద, నామవరం,కొత్తతుంగపాడు, సం పత్‌నగర్ 11 గ్రామాల్లో 220 మంది రైతు లకు చెందిన 250 హెక్టార్ల పంట నేల కొరిగింది.
- కడియం మండలంలో కడియం,వేమగిరి, దుళ్ల, మురమండ, జేగురుపాడు గ్రామాల్లో 227 మంది రైతులకు చెందిన 145 హెక్టార్ల పంట నేల కొరిగింది.
- అనపర్తి 9 గ్రామాల్లో 256 మంది రైతులకు చెందిన 278 హెక్టార్లు నేల కొరిగింది.
- బిక్కవోలు 12 గ్రామాల్లో 2,200 మందికి చెందిన 1493 హెక్టార్లు నేలకొరిగింది.
- సీతానగరం 3 గ్రామాల్లో 68 మంది రైతులకు చెందిన 52 హెక్టార్లు నేలకొరి గింది.
- కొవ్వూరులోని 58 మందికి చెందిన 52 ఎకరాల పంట నేలకొరిగింది.
- తాళ్లపూడి 13 గ్రామాల్లో 286 మంది రైతుల పంట 161 హెక్టార్లు నేలకొరిగింది.
- నిడదవోలు 16 గ్రామాల్లో 850 రైతులకు చెందిన 400 హెక్టార్లు పంట నేలకొరిగింది.
- ఉండ్రాజవరం మండలం 8 గ్రామాల్లో 212 మంది రైతులకు చెందిన 121.2 హెక్టార్లు ఒరిగిపోగా 18.29 హెక్టార్లు దెబ్బతింది.
- పెరవలి మండలం 3 గ్రామాల్లో 38 మంది రైతుల 18 హెక్టార్ల పంటనేలకొరిగిపోగా 36 హెక్టార్లలో దెబ్బతింది.
- నల్లజర్ల మండలం 4 గ్రామాల్లో 70 మంది రైతులకు చెందిన 10 హెక్టార్ల పంట నీట ఒరిగిపోగా 110 హెక్టార్లలో నష్టపోయింది.
- రంగంపేట మండలం 114 గ్రామాల్లో 545 మంది రైతులకు చెందిన 94 హెక్టార్లలో పంట ఒరిగిపోయింది.



కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడలో ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వరస్వామి



కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్లలో వీరేశ్వరస్వామికి పంచామృతాభిషేకం

హరోం హర



పిఠాపురంలో



రాజమహేంద్రవరంలో..

కార్తీక మాసం తొలి సోమవారం శైవ క్షేత్రాలు జనసంద్రమయ్యాయి. హరోంహర, ఓం నమశ్శివాయ అంటూ భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి. ఎటుచూసినా పంచాక్షరీ నామం ప్రతిధ్వనించింది. తుఫాన్ హెచ్చరికలు వున్నా తెల్లవారుజామునే ఆలయాలకు విచ్చేసి పరమశివుడిని దర్శించుకుని అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో అధిక సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలు ఆరించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ప్రముఖ క్షేత్రాలైన పిఠాపురం పాదగయలో కుక్కుటేశ్వరస్వామికి, సామర్లకోట, ద్రాక్షారామల్లో భీమేశ్వరస్వామికి, మురమళ్లలో వీరేశ్వరస్వామికి, కోటిపల్లిలో సోమేశ్వరస్వామికి అర్చకులు పంచామృతాభిషేకాలు, విశేష అర్చనలు జరిపారు.



కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లిలో అరుణాచలేశ్వరస్వామికి లక్ష రుద్రాక్షలతో అలంకరణ



తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో భక్తుల పుణ్యస్నానాలు



కుక్కుటేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పిఠాపురం పాదగయకు పోటెత్తిన భక్తులు

పిఠాపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రం భక్తజనసంద్రమైంది. కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో తెల్లవారు జామున రెండు గంటలకు ప్రారంభమైన భక్తుల రాక రాత్రి వరకు కొనసాగింది. పుష్కరిణిలో స్నానాలు ఆచరించిన భక్తులు కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు జరిపారు. ఉమాకుక్కుటేశ్వర స్వామికి అర్చకులు పంచామృత మహన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం వరకు ఉపవాసం ఉన్న మహిళలు ఆలయ ఆవరణలో దీపాలు వెలిగించి కార్తీక నోము ఆచరించారు. రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లకు కుంకుమార్చన చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఈవో కాట్నం జగన్మోహనశ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.



భీమేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు

దక్షిణ కాశీ ద్రాక్షారామలో...

ద్రాక్షారామ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పంచామ క్షేత్రాల్లో ఒకటైన, దక్షిణ కాశీగా పేరొందిన ద్రాక్షారామ భీమేశ్వరస్వామికి అర్చకులు విశేష పూజలు జరిగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు తరలివచ్చి భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకున్నారు. సామూహిక అభిషేకాల్లో పాల్గొన్నారు. ఆలయ సహాయ కమిషనరు అల్లు వెంకట దుర్గాభవాని ఆధ్వర్యంలో సిబ్బంది, సేవకులు భక్తులకు సేవలు అందించారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ భీమేశ్వరస్వామికి అభిషేకం, మాణిక్యాంబ అమ్మవారికి కుంకుమార్చన జరిపారు. ఆయనకు నంది మండపంలో వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు.



విద్యుద్దీపాలకాంతిలో కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రం

సామర్లకోట భీమేశ్వర ఆలయంలో...

సామర్లకోట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పంచారామ క్షేత్రమైన సామర్లకోట కుమారరామ భీమేశ్వరస్వామి ఆలయానికి తెల్లవారుజామున ఐదు గంటల నుంచే అధిక సంఖ్యలో భక్తులు చేరుకున్నారు. గోపూజతో కార్తీక సోమవారం పూజలను ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు భీమేశ్వరస్వామి, బాలాత్రిపురసుందరి అమ్మవార్లను దర్శించుకున్నారు. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కుటుంబ సమేతంగా విచ్చేసి స్వామికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన చేశారు.



మైనార్టీ యువతకు ఉద్యోగావకాశాలు

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మైనార్టీ యువతకు జర్మనీలో ఎలక్ట్రీషియన్ ఉద్యోగం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడీ ఎం.సునీల్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ), ఓఎంసీఏపీ, ఐఈఎస్‌ల సహకారంతో జర్మనీలో ఎలక్ట్రీషియన్ ఉద్యోగాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఈడి తెలిపారు. ఆసక్తి గల మైనార్టీ అభ్యర్థులు http://naipunyam.ap.gov.in/user వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కోరారు.

విద్యార్హతలు: ఐటీఐ(2 సంవత్సరాలు) లేదా డిప్లమా(3 సంవత్సరాలు), ఎలక్ట్రీషియన్ ట్రేడ్ పాస్ లేదా కనీసం 2 సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలన్నారు. గరిష్ట వయస్సు 30 సంవత్సరాలు.

ఉద్యోగ వివరాలు: ఎలక్ట్రీషియన్ ఉద్యోగం కోసం పనిచేసే ప్రాంతం జర్మనీ. జీతం 2600 నుంచి 2700 యూరోలు(సుమారు రూ.2.60 లక్షల నుంచి రూ.2.70 లక్షలు). రెండు సంవత్సరాలు. ఒప్పందం ప్రకారం ఓవర్ టైమ్, అలవెన్సులు, వసతి, రాక సహాయం అందిస్తారు. గుర్తింపు, అనువాద ఖర్చులను యజమాని భరిస్తారని తెలిపారు. నవంబరు 2025 నుంచి 12-14 వారాలు జర్మన్ భాషా శిక్షణ ఉంటుందన్నారు. అప్లికేషన్ ఫీజు, శిక్షణ ఫీజుతో సహా రూ.1.15 లక్షలు అభ్యర్థి మూడు వాయిదాల్లో చెల్లించాలని తెలిపారు. అలాగే ఆహారం, వసతి, విమాన, వీసా చార్జీలు కూడా భరించాలన్నారు. కావాల్సిన పత్రాలు: పాస్ పోర్టు, మునుపటి కంపెనీ రిలీవింగ్ లెటర్, సంబంధిత విద్యార్హత సర్టిఫికెట్లు. అర్హులైన మైనార్టీ అభ్యర్థులు నవంబరు 2వతేదీ లోపు దరఖాస్తులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. అలాగే బయోడేటా వివరాలు స్కిల్ ఇంటర్నేషనల్ ఏపీఎస్ఎస్‌డీసీ డాట్ ఇన్‌కు పంపించాలని కోరారు. మరిన్ని వివరాలకు 99888 53335, 87126 55686, 87901 18349, 87901 17279 నెంబర్లను సంప్రదించాలని సునీల్‌కుమార్ పేర్కొన్నారు.

పిల్లా చంద్రానికి గౌరవ డాక్టరేట్



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న చంద్రం

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామానికి చెందిన ఆల్ ఇండియా పాఠశాలల పేరెంట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పిల్లా చంద్రం డాక్టరేట్ అందుకున్నారు. నీతి ఆయోగ్ ద్వారా గుర్తింపు పొందిన ఆసియా అంతర్జాతీయ సంస్కృతి పరిశోధనా విశ్వవిద్యాలయం ప్రతినిధులు కర్నాటక రాష్ట్రంలోని హోసూరులో జరిగిన కార్యక్రమంలో చంద్రానికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లోని మూడు వేల ప్రభుత్వ, గురుకుల పాఠశాలలను పేరెంట్స్ అసోసియేషన్ తరఫున సందర్శిస్తూ చేపట్టిన కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా చంద్రానికి పలువురు అభినందనలు తెలిపారు.

గోదావరి స్నానాల ఘాట్లు మూసివేత



గోదావరి రేవులను పరిశీలించి సూచనలు చేస్తున్న కమిషనర్ రాహుల్ మీనా

రాజమహేంద్రవరం మునిసిపల్ కమిషనర్ రాహుల్‌మీనా

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రాజమహేంద్రవరంలోని గోదావరి ఘాట్లను మూసివేసినట్టు మునిసిపల్ కమిషనర్ రాహుల్‌మీనా తెలిపారు. సోమవారం రాజమహేంద్రవరంలో పుష్కరఘాట్, లక్ష్మీగణపతి ఘాట్‌లను పరిశీలించారు. నదిలోని నీటిప్రవాహం చూసి కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఘాట్లలోకి స్నానాలకు వెళ్లకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. తుఫాన్ కారణంగా ఘాట్‌లు ప్రమాదకరంగా మారడంతో వాటిని తాత్కాలికంగా మూసివేసినట్టు వెల్లడించారు. భక్తులు, ప్రజలు గోదావరి ఘాట్లకు వెళ్లవద్దని సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంట నగర ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వినూత్న, ఎస్ఈ ఇన్‌చార్జి రీటా, ఈఈ మాధవి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ యూనివర్శిటీ మహిళ

కబడ్డీ పోటీలకు నన్నయ విద్యార్థుల ఎంపిక



పోటీలకు ఎంపికైన నన్నయ విశ్వవిద్యాలయం కబడ్డీ జట్టు సభ్యులతో రిజిస్ట్రార్ స్వామి

దివాన్‌చెరువు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్శిటీ మహిళా కబడ్డీ పోటీలకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యార్థులు ఎంపికయ్యారని రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి తెలిపారు. విశ్వవిద్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.. తమిళనాడు సేలంలో వినాయక మిషన్ రీసెర్చ్ ఫౌండేషన్‌లో ఈ నెల 29 నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకూ జరిగే దక్షిణ మండల అంతర్ విశ్వవిద్యాలయాల మహిళా కబడ్డీ పోటీలకు నన్నయ విద్యార్థులు ఎంపికయ్యారని చెప్పారు. గొల్లల మామిడాడలోని డీఆర్‌కే రెడ్డి వ్యాయామ విద్య కళాశాలలో జరిగిన అంతర్ కళాశాలల పోటీల్లో ప్రతిభ కనబరచిన 14 మంది క్రీడాకారులకు ఐదురోజులు కోచింగ్ క్యాంప్ నిర్వహించి జట్టును ఎంపిక చేశారన్నారు. వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అధ్యాపకులు ఆచార్య డి.జ్యోతిర్మయి, పి.వెంకటేశ్వరరావు, ఎ.మట్టారెడ్డి, క్రీడా బోర్డు సహాయ కార్యదర్శి ఎంవీఎస్ఎస్ఎన్ మూర్తి, కోచ్, పీవీవీ లక్ష్మి, మేనేజర్ కె.లోవరాజు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు

186 గ్రాములు బంగారం, 263 గ్రాముల వెండి స్వాధీనం



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ శ్రీనివాసరావు

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని శ్రీకాకుళం రూరల్, గార పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆరు ఇళ్లల్లో జరిగిన దొంగతనం కేసుల్లో 186 గ్రాముల బంగారం, 263 గ్రాముల వెండి ఆభరణాలను పోలీసులు రికవరీ చేశారు. అంతర్ జిల్లాకు చెందిన ముగ్గురిని అరెస్టు చేశారు. ఏఎస్పీ(క్రైం) పి.శ్రీనివాసరావు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను వెల్లడించారు. 'శ్రీకాకుళం మండలం నందగిరిపేటలో 2, రాగోలులో 1,గార మండలం కె.మత్స్యలేశంలోని 3 దొంగతనాల కేసులు ఇటీవల నమోదయ్యాయి. కాకినాడకు చెందిన రేకడి వెంకటేశ్వర్లు, ధర్మాది ప్రసాద్, మాడెం మోహన్‌కుమార్ ఈ చోరీలకు పాల్పడినట్టు దర్యాప్తులో తేలింది. వారిని శ్రీకాకుళం మండలం తండ్యేంవలసలో సోమవారం అరెస్టు చేశాం. వారి నుంచి చోరీకి గురైన 186 గ్రాముల బంగారం, 263 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నాం. ఈ ముగ్గురూ కాకినాడ సబ్‌జైల్లో ఉన్నప్పుడు స్నేహితులయ్యారు. చోరీలను వృత్తిగా మార్చుకున్నారు. ఒక్కొక్కరిపై సుమారు 25 కేసులు ఉన్నాయి అని ఏఎస్పీ తెలిపారు. అలాగే దూసి గ్రామంలో రూ.3లక్షల నగదు, 8 తులాల బంగారం పోయిందని తప్పుడు ఫిర్యాదు ఇచ్చిన వ్యక్తి ఇంట్లో ఎటువంటి చోరీ జరగలేదన్నారు. తప్పుడు ఫిర్యాదు ఇచ్చిన వ్యక్తిపై కూడా కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

ఆలిండియా సివిల్ సర్వీసెస్ జిల్లా స్థాయి ఎంపికలు వాయిదా

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలను దృష్టిలో పెట్టుకుని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ రాష్ట్ర స్థాయి ఎంపికలను వాయిదా వేసింది. ఈ మేరకు కొత్త తేదీలను త్వరలో ప్రకటించనున్నట్టు అధికారులు తెలిపారు. జిల్లా స్థాయిలో కూడా వాతావరణ హెచ్చరికలను పరిగణలోకి తీసుకుని కాకినాడ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 29న జరగాల్సిన ఆలిండియా సివిల్ సర్వీసెస్ జిల్లా స్థాయి ఎంపికలు వాయిదా వేసినట్టు అధికారులు ప్రకటించారు. కొత్త తేదీలను నిర్ణయించి అనంతరం సమాచారం అందించనున్నట్టు పేర్కొన్నారు.

పాదగయలో ముమ్మిడివరం ఎమ్మెల్యే పూజలు



ఎమ్మెల్యే సుబ్బరాజుకు స్వామి, అమ్మవార్ల చిత్రపటం అందజేస్తున్న ఈవో జగన్మోహన శ్రీనివాస్

పిఠాపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు సోమవారం విచ్చేశారు. కుటుంబసభ్యులతో కలిసి కుక్కుటేశ్వరస్వామి దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు జరిపారు. ఆలయ పండితులు క్షేత్ర ప్రాశస్త్యం వివరించి ఆశీర్వచనాలు అందించారు. ఎమ్మెల్యే దంపతులను ఈవో జగన్మోహన శ్రీనివాస్ శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదం, స్వామి,అమ్మవార్ల చిత్రపటం అందజేశారు. పండితులు వింజమూరి సుబ్రహ్మణ్యశర్మ, అల్లంరాజు చంద్రమౌళి, సూపరింటెండెంట్ బొల్లం వీరభద్రరావు, రెడ్నం ప్రసాద్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ దత్తాత్రేయ పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో ఎమ్మెల్యే చినరాజప్ప పూజలు



భీమేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మొదటి సోమవారం కాకినాడ జిల్లా సామర్లకోటలోని కుమారరామ భీమేశ్వరాలయాన్ని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కుటుంబ సమేతంగా సందర్శించారు. భార్య అనురాధ, కుమారుడు రంగనాగ్, కోడలు సృజన, మనుమలతో కలిసి ఆలయానికి వచ్చిన ఆయనకు ఈవో బళ్ల నీలకంఠం, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే జగదీష్‌మోహన్(బాబు) ఆధ్వర్యంలో వేదపండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. భీమేశ్వరునికి అభిషేకాలు, బాలాత్రిపుర సుందరి అమ్మవారికి కుంకుమార్చన చేశారు. అనంతరం ఎమ్మెల్యే కుటుంబీకులకు నంది మండపం వద్ద పండితులు వేదాశీర్వచనం, ప్రసాదాలు అందజేశారు.

పలు రైళ్లు రద్దు

భీమవరం క్రైం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను నేపథ్యంలో పశ్చిమ గోదావరి జిల్లా మీదుగా వెళ్లే పలు రైళ్లను రద్దు చేశారు. సోమవారం విశాఖ-ఎల్‌టీటీ(18519), మంగళవారం ఎల్‌టీటీ-విశాఖ(18520) ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినట్టు భీమవరం జంక్షన్ రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ చక్రవర్తి తెలిపారు. 28న విజయవాడ-భీమవరం(67281),భీమవరం-విజయవాడ(67282), భీమవరం-నిడదవోలు (67283), నిడదవోలు-భీమవరం(67284), నరసాపురం-నిడదవోలు(67244), నిడదవోలు-నరసాపురం(67245), నరసాపురం-రాజమండ్రి (67246), నరసాపురం-విజయవాడ(67276), భీమవరం-నిడదవోలు(67277), నిడదవోలు-భీమవరం(67278), నరసాపురం-గుంటూరు(67247), విజయవాడ-నరసాపురం(67257), రాజమండ్రి-భీమవరం(67241), 29న భీమవరం-నిడదవోలు(67242), నిడదవోలు-నరసాపురం(67243), నరసాపురం-నిడదవోలు(67244), నిడదవోలు-నరసాపురం(67245), భీమవరం-నరసాపురం(17263) రైళ్లను రద్దు చేసినట్టు సూపరింటెండెంట్ చక్రవర్తి పేర్కొన్నారు.

హ్యూమన్‌రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్

సౌత్ ఇండియా చైర్మన్‌గా కృష్ణమూర్తి



కృష్ణమూర్తికి నియామకపత్రం అందజేస్తున్న నేషనల్ చైర్మన్ ప్రసన్నకుమార్

కాకినాడ సిటీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ సౌత్ ఇండియా చైర్మన్‌గా లయన్స్ క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ లింగమల్లు కృష్ణమూర్తి నియమితులయ్యారు. ఆయనకు నేషనల్ చైర్మన్ తాళ్లూరి ప్రసన్నకుమార్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు. కాకినాడలోని కాస్మోపాలిటన్ క్లబ్ హాలులో జరిగిన కార్యక్రమంలో కౌన్సిల్ సౌత్ ఇండియా చైర్మన్ బీఎస్ కృష్ణ, ఏపీ ఎస్సీ సెల్ చైర్‌పర్సన్ బొల్లిపల్లి జోసీకుమారి తదితరులు పాల్గొన్నారు.

మొంథా..ముందుగానే నీటి విడుదల!

● తుఫాన్ కారణంగా భారీ వర్ష సూచన

● ఏలేరు రిజర్వాయర్ నుంచి 5వేల క్యూసెక్కుల నీరు విడుదల

ఏలేశ్వరం/పిఠాపురం/గొల్లప్రోలు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ఏలేరు రిజర్వాయర్ నుంచి నీటి విడుదలను సోమవారం సాయంత్రం 6గంటలు నుంచి 5వేల క్యూసెక్కులకు పెంచారు. ఇన్‌ఫ్లోస్ సాధారణంగా ఉన్నప్పటికి మొంథా తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న సమాచారంతో దిగువకు నీటిని అధికంగా విడుదల చేస్తున్నారు. ఏలేరు రిజర్వాయర్ నుంచి సోమవారం ఉదయం 6గంటలకు వరకూ 3175 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, 500 క్యూసెక్కుల వంతున పెంచుకుంటూ సాయంత్రానికి 5,175 క్యూసెక్కులకు పెంచారు. స్పిల్‌వే ద్వారా 4,400 క్యూసెక్కులు, డీసీఆర్ స్లూయిజ్ ద్వారా 600 క్యూసెక్కులు వెరసి 5వేల క్యూసెక్కులకు కాలువలకు విడుదల చేస్తున్నారు. విశాఖ అవసరాల నిమిత్తం 175 క్యూసెక్కుల నీటిని పంపుతున్నారు. ఇన్ ఫ్లోస్ 1700 క్యూసెక్కులు మాత్రమే ఉన్నాయి. ఇన్‌ఫ్లోస్ కంటే మూడు రెట్లు అధికంగా అవుట్‌ఫ్లోస్ ఉండడంతో ఏలేరు రిజర్వాయర్‌లో నీటి నిల్వలు 21.90 టీఎంసీలకు తగ్గగా, నీటిమట్టం 85.47మీటర్లుగా ఉంది. తుఫాన్ ప్రభావంతో క్యాచ్‌మెంట్ ఏరియాలో అతి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నారు. దీంతో ఇన్‌ఫ్లోస్ భారీగా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీంతో అవుట్‌ఫ్లోస్ పెంచినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

అత్యంత అప్రమత్తం

ఏలేరు నుంచి 5వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండడంతో గొల్లప్రోలు, పిఠాపురం, కొత్తపల్లి, కిర్లంపూడి, పెద్దాపురం, సామర్లకోట, ప్రత్తిపాడు, ఏలేశ్వరం తదితర మండలాల్లో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ అయ్యాయి. దీనికి అనుగుణంగా రెవెన్యూ అధికారులు గ్రామాల్లో పర్యటించి ప్రజలకు సమాచారం ఇస్తున్నారు.

డొంకరాయి జలాశయం నుంచి 15 వేల క్యూసెక్కులు..

మోతుగూడెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సీలేరు కాంప్లెక్సు పరిధిలోని డొంకరాయి జలాశయం నుంచి 15వేల క్యూసెక్కుల నీటిని జెన్‌కో అధికారులు సోమవారం విడుదల చేశారు. మొంథా తుఫాన్‌లో భాగంగా ముందు జాగ్రత్త చర్యగా డ్యాం సేఫ్టీ అధికార్ల ఆదేశాల మేరకు జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తున్నట్టు సీలేరు కాంప్లెక్సు ఏపీ జెన్‌కో సీఈ రాజారావు తెలిపారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1037 అడుగులు కాగా ఇటీవల ఈ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతంలో ఉన్న వలస గెడ్డ, పాలగెడ్డ, మంగంపాడు తదితర చోట్ల నుంచి భారీగా వరద నీరు వచ్చి జలాశయంలోకి రావడంతో నీటి మట్టం 1036.50 అడుగులకు చేరుకుంది. నీటి మట్టాన్ని తగ్గించే చర్యల్లో భాగంగానే 15వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నామన్నారు. ప్రస్తుతం జలాశయానికి 10 వేల నుంచి 12వేలు క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నాయని, నీటి విడుదల నేపథ్యంలో జలాశయం దిగువున ఉన్న ప్రజలను అప్రమత్తం చేశామన్నారు. కాంప్లెక్సు పరిధిలోని జోలాపుట్, సీలేరు జలాశయాల వద్ద కూడా జెన్‌కో అధికారులను అప్రమత్తం చేసి ఎప్పటికప్పుడు వరద నీటిని పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశామని తెలిపారు.



డొంకరాయి జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం





ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు, పిఠాపురం-గొల్లప్రోలు మధ్య ఏలేరు ప్రవాహ ఉధృతి

పంపా, తాండవ నుంచి కూడా...

అన్నవరం/కోటనందూరు అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అన్నవరంలో పంపా రిజర్వాయర్‌లో నీటిమట్టం నిలకడగా ఉంది. తుఫాన్ నేపథ్యంలో అధికారులు రిజర్వాయిర్ వద్ద ఉండి పర్యవేక్షణ చేస్తున్నారు. ప్రస్తుతం 99 అడుగులు నీటిమట్టం ఉందని, ఇన్‌ఫ్లో 700 క్యూ సెక్కులు వస్తుండగా 650 క్యూసెక్కుల నీటిని పంట, వరద కాలువల ద్వారా బయటకు పంపిస్తున్నారు. అలాగే తాండవ రిజర్వాయర్ నుంచి 310 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని డీఈ అనురాధ తెలిపారు.



అన్నవరం పంపా రిజర్వాయర్‌లో నీరు

తుఫాన్ హెచ్చరికలు..
రత్నగిరిపై భక్తుల రక్షణకు చర్యలు

అన్నవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో బలమైన ఈదురు గాలులు వీస్తాయని వాతావరణ శాఖ సూచనలతో అన్నవరం దేవస్థానం అధికారులు అప్రమత్తమయ్యారు. కార్తీకమాసం సందర్భంగా భక్తులకు ఎండా, వానల నుంచి రక్షణగా పలు కూడళ్లలో రేకులషెడ్లులు వేసి క్లాత్ డెకరేట్ చేశారు. అయితే అవి గాలులకు ఎగిరిపోకుండా పటిష్టమైన తాళ్లతో బిగించి జాగ్రత్తలు తీసుకున్నారు. భక్తులు ఎక్కడా ఎక్కువసేపు నిల్చోవద్దని మైక్ ద్వారా ప్రచారం గావించారు. దర్శనాలు, వ్రతాలు పూర్తయిన వారు తమ స్వస్థలాలకు వెళ్లిపోవాలంటూ ప్రచారం చేశారు.



భక్తులకు రక్షణగా ఏర్పాటు చేసిన రేకులను పటిష్టం చేస్తున్న అధికారులు

తగ్గిన భక్తుల తాకిడి

అన్నవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం సత్యదేవుడి ఆలయంపై పడింది. కార్తీకమాసం సోమవారం పర్వదినమైనా భక్తులు సందడి పెద్దగా కనిపించలేదు. ఉదయం 10గంటలకే ఆలయప్రాంగణం ఖాళీ అయిపోయింది. సోమవారం సుమారు 4వేల వ్రతాలు జరుగుతాయని అధికారులు అంచనా వేసినా కేవలం 2వేలు మాత్రమే జరిగాయి. కార్తీకమాసం ప్రత్యేక అధికారులుగా నియమించిన డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు, తలుపులమ్మ ఆలయ ఈవో విశ్వనాథరాజు, చైర్మన్ రోహిత్‌లు కమాండ్ కంట్రోల్ రూం నుంచి క్యూలైన్‌లు, రద్దీ నియంత్రణకు తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. దేవస్థానం ఈవో సుబ్బారావు ప్రధానాలయం, ఇతర ప్రాంతాల్లో పర్యటించారు.



భక్తులు లేక వెలవెలబోతున్న సత్యదేవుడి ఆలయ ప్రాంగణం

కాకినాడ జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డు ఏర్పాటు



ఏర్పాటు చేసిన ప్రత్యేక వార్డు

జీజీహెచ్ (కాకినాడ), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా కాకినాడ జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశారు. ఫిమేల్ ఆర్థో వార్డులో 49 పడకల సామర్థ్యంతో తుఫాను ప్రభావంతో ప్రమాదాలు జరిగితే ఈ వార్డును వినియోగించేందుకు ఏర్పాటు చేశారు. అన్ని మౌలిక సదుపాయాలు, ప్రత్యేక వైద్య బృందం, నిరంతరప్రాయంగా వైద్య సేవలు అందించేందుకు పలు విభాగాల వైద్య నిపుణులు, వైద్యేతర సిబ్బంది విధులు నిర్వర్తించే విధంగా జీజీహెచ్ ఆసుపత్రి అధికారులు చర్యలు చేపట్టారు.

ఇంటర్ పరీక్ష ఫీజు 31 లోపు చెల్లించాలి

జరిమానాతో వచ్చే నెల 6 వరకూ అవకాశం

రాజమహేంద్రవరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): వచ్చేఏడాది మార్చిలో నిర్వహించే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే జనరల్, ఒకేషనల్.. రెగ్యులర్, ఫెయిల్ అయిన విద్యార్థులు ఈ నెల 31లోపుగా పరీక్ష ఫీజును చెల్లించాలని తూర్పుగోదావరి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎన్ఎస్‌వీఎల్.నరసింహం తెలిపారు. రూ.వెయ్యి జరిమానాతో నవంబరు 6 వరకూ చెల్లించవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులను అన్ని కళాశాలల ప్రిన్సిపాల్స్‌కి తెలియజేశామన్నారు. విద్యార్థులు గడువు లోపు పరీక్ష రుసుం చెల్లించాలని సూచించారు.

నిబంధనలు పాటించని 3 బస్సుల సీజ్

20 బస్సులకు జరిమానా

ముమ్మిడివరం/రావులపాలెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మోటారు వాహనాల చట్టం ఉల్లంఘన కింద 2 ప్రయివేటు ట్రావెల్ బస్సులను సీజ్ చేసి మరో 9 బస్సులపై కేసులు నమోదు చేసి జరిమానా విధించినట్టు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రవాణా అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. ముమ్మిడివరం మండలం అన్నంపల్ల టోల్ ప్లాజా వద్ద నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 11 ప్రయివేటు ట్రావెలర్ బస్సులపై కేసులు నమోదు చేశామన్నారు. వీటిలో మోటారు వాహనాల చట్టం ఉల్లంఘన కింద 2 బస్సులను సీజ్ చేసి, మరో 9 బస్సులపై ఇతర కేసులు నమోదు చేసి రూ.18 వేలు అపరాధ రుసుం విధించినట్టు తెలిపారు. సీజ్ చేసిన 2 బస్సుల్లో నిబంధనలు పాటించకుండా అనాధికారికంగా సీట్లు మార్పు చేసినట్టు గుర్తించామని వీటిని ముమ్మిడివరం పోలీస్‌స్టేషన్ అప్పగించామని తెలిపారు. అలాగే రావులపాలెం జాతీయ రహదారిపై తనిఖీ చేసి సిరి ట్రావెల్స్‌కు చెందిన ఓ బస్సును సీజ్ చేయడంతో పాటు 11 బస్సులపై రూ.32వేల ఫైన్ విధించినట్టు ఆయన చెప్పారు.




బస్సులను తనిఖీ చేస్తున్న కోనసీమ జిల్లా రవాణా అధికారి



బోటు.. ట్రాన్స్‌పోర్టు!

కాకినాడ జిల్లా ఉప్పాడ సముద్రతీరం నుంచి పిఠాపురం మీదుగా ఓ బోట్‌ను వ్యాన్‌పై కాకినాడ సమీపంలో తుఫాన్ ముంపు ప్రమాదం పొంచి ఉన్న ప్రాంతాలకు సోమవారం తరలిస్తుండగా ఆంధ్రజ్యోతి క్లిక్ మనిపించింది.



కాకినాడ జిల్లా తొండంగిలో ఎక్స్‌కవేటర్ సహాయంతో బోటును ఒడ్డు నుంచి సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న మత్స్యకారులు

తుఫాన్ ఎఫెక్ట్
పలు రైళ్లు రద్దు

రైల్వే స్టేషన్లలో ప్రత్యేక హెల్ప్‌లైన్‌లు

రైల్వే యంత్రాంగం జాగ్రత్త చర్యలు

సామర్లకోట/ రాజమహేంద్రవరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ఈదురు గాలులు, భారీవర్షాల కారణంగా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా విశాఖ నుంచి సామర్లకోట మీదుగా రాకపోకలు సాగించే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను 3రోజుల బాటు తాత్కాలికంగా రద్దు చేసినట్టు రైల్వే ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. రైళ్ల రద్దు, ఆలస్యం, రిజర్వేషన్ టిక్కెట్ల విషయాలు ప్రయాణికులు తెలుసుకునేందుకు విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో 9 హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని సామర్లకోట రైల్వే స్టేషన్‌తో సహా రాజమహేంద్రవరం, కాకినాడ టౌన్ స్టేషన్లలో ప్రత్యేక హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటుచేసి నిరంతరం సమాచారాన్ని అందివ్వనున్నట్టు తెలిపారు. సామర్లకోట రైల్వే స్టేషన్‌లో 7382383188, రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో 8331987657, కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్‌లో 0884-2374227 నంబర్లకు ఫోన్ చేసి రైల్వే సమాచారాన్ని తెలుసుకోవచ్చని రైల్వే సూపరింటెండెంట్ ఎం.రమేష్ తెలిపారు.

రద్దయిన రైళ్లు ఇవే

విశాఖ-విజయవాడ మధ్య సామర్లకోట స్టేషన్‌మీదుగా రాకపోకలు సాగించే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేసినట్టు ఈస్ట్‌కోస్ట్ రైల్వే అధికారులు సోమవారం రాత్రి తెలిపారు. ఈ నెల 28 మంగళవారం రైలు నెం.67285, 67286 రాజమండ్రి-విశాఖ-రాజమండ్రి మెము, 17268, 17267 విశాఖ-కాకినాడ-విశాఖ, 08583/84 విశాఖ-తిరుపతి-విశాఖ, 22875/76 విశాఖ-గుంటూరు-విశాఖ డబుల్ డెకర్, 22707 విశాఖ-తిరుపతి డబుల్ డెకర్, 17243/44 గుంటూరు-రాయగడ-గుంటూరు, 17220 విశాఖ- మచిలీపట్నం, 12727 విశాఖ-హైదరాబాద్, 12861 విశాఖ-మహబూబ్‌నగర్, 12862 మహబూబ్‌నగర్-విశాఖ(28న), 22869 విశాఖ- చెన్నై వీక్లీ, 12739న విశాఖ-సికింద్రాబాద్, 20805 విశాఖ-ఢిల్లీ ఏపీ ఎక్స్‌ప్రెస్, 22707 విశాఖ-తిరుపతి వీక్లీ డబుల్ డెకర్, 18519 విశాఖ-ముంబై ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌లను రానుపోను రైళ్లను రద్దు చేశారు.

14 రైళ్లు పునరుద్ధరణ

తుఫాను కారణంగా విజయవాడ రైల్వే ఉన్నతాధికారులు 14 రైళ్లను రద్దు చేసినట్లు ప్రకటించినప్పటికీ సోమవారం పునరుద్ధరించినట్లు రైల్వే డిప్యూటీ సీవోఎం సందీప్‌కుమార్ సోమవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. 08583 విశాఖ- తిరుపతి, 22707 విశాఖ-తిరుపతి డబుల్ డెక్కర్, 17243 గుంటూరు-రాయగడ, 17244 రాయగడ-గుంటూరు, 17220 విశాఖ-మచిలీపట్నం, 12727 విశాఖ- హైదరాబాద్, 12861 విశాఖ- మహబూబ్‌నగర్, 22869 విశాఖ-మద్రాసు వారాంతపు ఎక్స్‌ప్రెస్, 12739 విశాఖ-సికింద్రాబాద్, 20805 విశాఖ-న్యూఢిల్లీ, 22707 విశాఖ-తిరుపతి వారాంతపు డబుల్ డెక్కర్, 18519 నంబరు గల విశాఖ-ఎల్టీటీ రైళ్లు పునరుద్ధరించిన వాటిలో ఉన్నట్టు పేర్కొన్నారు. 20806 నంబరు గల న్యూఢిల్లీ-విశాఖ, 18520 నంబరు గల ఎల్టీటీ-విశాఖ ఎక్స్‌ప్రెస్ రైళ్ళు ఈనెల29న యథావిధిగా బయలుదేరనున్నాయి.

పర్ర కాలువలో పడి బాలుడు గల్లంతు

కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేటలో ఘటన

గాలింపు చర్యలు చేపట్టిన ఎస్‌డీఆర్ఎఫ్ బృందం





చరణ్‌సాయి(ఫైల్), గాలిస్తున్న ఏపీ ఎస్‌డీఆర్ఎఫ్ బృందం

సర్పవరం జంక్షన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట పర్ర కాలువలో పడి 11 ఏళ్ల బాలుడు గల్లంతైన ఘటన సోమవారం ఉదయం 11 గంటలకు జరిగింది. కాకినాడ మధురానగర్‌కి చెందిన పోలవరపు రమణ, దుర్గాభవానీ భార్యభర్తలు. కూలీ పనుల జీవనోపాధి కోసం తుని నుంచి 6నెలల కిందట మధురానగర్ వచ్చి నివాసం ఉంటున్నారు. వారికి కొడుకు చరణ్ సాయి రిత్విక్ (11) ఉన్నాడు. స్థానికంగా ప్రైవేట్ పాఠశాల్లో 6వ తరగతి చదువుతున్నాడు. తుఫాన్ కారణంగా పాఠశాలలకు సోమవారం నుంచి సెలవులు ఇవ్వడంతో ఆర్టీవో ఆఫీసు రోడ్డులో నివాసం ఉంటున్న మేనమావయ్య కొప్పిశెట్టి శ్రీనివాస్ ఇంటికి వెళ్తానని తల్లిదండ్రులకు చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. అక్కడ నుంచి నేమాంలో ఉన్న అమ్మమ్మ ఇంటికి శ్రీనివాస్ బైక్‌పై చరణ్ సాయి రిత్విక్ ఇద్దరూ బయలుదేరారు. బీచ్‌రోడ్డులో రాకపోకలు నిషేధించడంతో సూర్యారావుపేట గ్రామం నుంచి పర్ర కాలువ మీదుగా వెళుతున్నారు. ఈ క్రమంలో పర్ర కాలువ కాజ్‌వై పైనుంచి ప్రవహిస్తోన్న వరద నీటిపై నుంచి వెళ్తుండగా అప్రోచ్ వద్ద ఉన్న నీటితో నిండిన గోతిలో బైక్ పడింది. బాలుడు బ్రిడ్జి అంచున పడడంతో పైకి లేపేలోపు నాకు ఈత వచ్చంటూ పర్ర కాలువలోకి దూకేశాడని మేనమామ శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశాడు. నీరు ప్రవాహం ఉధృతిగా ఉందని, వెంటనే బయటకు వచ్చేయి అని చెప్పగా, అప్పటికే కొద్దిదూరం ఈదుకుంటూ వెళ్లిన చరణ్‌సాయి రుత్విక్ వెనక్కి వస్తున్న క్రమంలో నీటి ప్రవాహానికి కొట్టుకుపోయినట్టు శ్రీనివాస్ చెప్పినట్టు కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ తెలిపారు. ఎమ్మెల్యే పంతం నానాజీకి బాలుడు గల్లంతు సమాచారం తెలియడంతో పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి ఏపీ ఎస్‌డీఆర్ఎఫ్ బృందం, గజ ఈతగాళ్లను రప్పించి గాలింపు చర్యలు చేపట్టారు. బాలుడ్ని రక్షించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. సంఘటనా ప్రదేశం వద్ద తహశీల్దారు వీ.కుమారి, కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో తిమ్మాపురం ఎస్ఐ వై.గణేష్‌కుమార్ సిబ్బందితో గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. వీఆర్వో చిన్న ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామని, మంగళవారం ఉదయం గాలింపు కొన సాగిస్తామన్నారు. రహదారిలో రాకపోకలు నిషేధిస్తూ కాజ్‌వేకు అడ్డంగా పెద్ద దుంగలు పెట్టినా వీటిని పక్కకు తోసేసి బైక్‌పై వెళ్లడం జరిగిందన్నారు.

ఒడిశా కార్మికుడి అనుమానాస్పద మృతి



కెసాబా పోడే (ఫైల్)

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం జీజీహెచ్ సమీపంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీ నూతన భవనంలో ఒడిశాకు చెందిన కెసాబా పోడే (49) అనే కార్మికుడు అనుమానాస్పద రీతిలో మృతి చెందిన సంఘటన సోమవారం వెలుగు చూసింది. లిఫ్ట్ నిర్మాణ ప్రదేశంలో మృతదేహం కుళ్లిపోయి గుర్తుపట్టలేని స్థితిలో ఉండడంతో పాటు శరీరంలోని కొన్ని అవయవాలు కనిపించకపోవడంతో కొన్ని రోజుల క్రితమే మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. కెసాబా పోడే పది రోజుల క్రితమే ఒడిశా నుంచి ఇక్కడికి పనికి వచ్చినట్టు చెప్తున్నారు. పోలీసులు సంఘటనా ప్రదేశాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేశారు. కాగా మెడికల్ కాలేజీ భవన నిర్మాణంలో వర్క్ సైట్ మేనేజర్‌తోపాటు వివిధ హోదాల్లో సూపర్‌వైజర్లు, మేస్త్రీ తదితరులు పనులు పర్యవేక్షిస్తుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో కార్మికుడు ఒకరు అదృశ్యమైనా పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంపై సహచర కార్మికుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోపక్క నిర్మాణ పనులు పర్యవేక్షించే ఏపీఎస్ఎంఐడీసీ అధికారులకు దీని గురించి తెలియదా ? లేక తెలిసీ నిర్లక్ష్యం చూపించారా అనే ఆరోపణలు వస్తున్నాయి.

లారీ బోల్తా : డ్రైవర్‌కు తీవ్రగాయాలు

కొవ్వూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): లారీ బోల్తా పడి డ్రైవర్‌కు తీవ్రగాయాలైన సంఘటన తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కాపవరం హైవేపై జరిగింది. నల్లగొండ నుంచి కాకినాడ వైపు సోనా మసూర్ బియ్యం లోడ్‌తో వెళ్తున్న 16 చక్రాల లారీ ఎడమవైపునకు రోడ్డుపై అడ్డంగా బోల్తా పడింది. నల్లగొండ జిల్లా దేవరకొండ గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ పిల్లి శ్రీను తలకు తీవ్రగాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదంతో హైవేపై ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. దీనిపై ఇప్పటివరకు ఎటువంటి కేసు నమోదు కాలేదు.



కాపవరం హైవేపై బోల్తా పడిన లారీ

మారణాయుధాలు చూపి దోపిడీకి యత్నం

ముగ్గురు యువకుల అరెస్ట్



నిందితులతో గోకవరం పోలీసులు

గోకవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మారణాయుధాలు చూపించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న ముగ్గురు యువకులను సోమవారం అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా గోకవరం గ్రామానికి చెందిన నల్లంశెట్టి రాజేష్, లింగంపల్లి శివ, తుమ్మల అరవింద్ కలిసి ప్రజలను మారణాయుధాలతో బెదిరించి దారి దోపిడీకి యత్నిస్తున్నట్టు గుర్తించామన్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం రాజమహేంద్రవరం కోర్టుకు తరలించామన్నారు.

పిడుగుపడి గేదె మృతి



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్

ప్రత్తిపాడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం టి.రాయవరంలో తుఫాన్ కారణంగా పిడుగుపడి కొండి చక్రానికి చెందిన గేదె మృతి చెందింది. సంఘటనా స్థలాన్ని తహశీల్దార్ ఎం.సూర్యప్రభ పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తగిన పరిహారం అందించే చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ హామీ ఇచ్చారు.

పేకాడుతున్న 18 మంది అరెస్ట్

రావులపాలెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలంలో రెండు వేర్వేరు చోట్ల పేకాట శిబిరాలపై పోలీసులు దాడి చేసి 18 మందిని అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని వెదిరేశ్వరంలోని ఓ రహస్య ప్రాంతంలో పేకాట ఆడుతున్నట్టు సమాచారం రావడంతో టౌన్ సీఐ శేఖర్‌బాబు ఆధ్వర్యంలో దాడి చేసి 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.25,070 స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా స్థానిక శ్రీనివాసనగర్‌లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి 8మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.2,305 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ రెండు పేకాట శిబిరాల్లో అదుపులోకి తీసుకున్న 18 మందిపై కేసు నమోదు చేసినట్టు సీఐ శేఖర్‌బాబు పేర్కొన్నారు.

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

తుఫాన్‌పై ఆందోళన వద్దు : మంత్రి



ఉండ్రాజవరంలో అధికారులతో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

ఉండ్రాజవరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తుఫాన్‌పై ప్రజలు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం బాసటగా నిలుస్తుందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. సోమవారం రాత్రి స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తుఫాన్ ముందుస్తు చర్యలపై ఆయన అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కమాండ్ కంట్రోలు పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రతి ఏటా ఈ తరహా విపత్తులు సంభవిస్తూనే ఉన్నాయని, ప్రభుత్వం ముందుస్తు చర్యలు చేపట్టడం ద్వారా ప్రమాదాన్ని అరికడుతోందని చెప్పారు. అధికారులు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, అవసరమైన వైద్యసేవలు, భోజన, తాగునీరు అవసరాలు తీర్చడంలో పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని సూచించారు. చెట్లు పడిపోవడం, విద్యుత్ స్తంభాలు విరిగి పడబం వంటి సంఘటనలు జరిగిన వెంటనే పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలన్నారు. తుఫాను కంట్రోల్ రూమ్‌లను పరిశీలించి, పలు సూచనలు చేశారు. అనంతరం పెరవలి తహశీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఎంపీడీవో ఎం.శ్రీనివాస్, టీడీపీ మండలాధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, జనసేన పార్టీ మండలాధ్యక్షుడు వీరమళ్ల బాలాజీ, ఇతర అధికారులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులు కనీస మద్దతు ధర పొందాలి

ఎమ్మెల్యే ముప్పిడి



పశివేదలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రైతులు తను పండించిన ధాన్యాన్ని రైతుసేవా కేంద్రాల్లో విక్రయించి కనీస మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం పశివేదలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు దళారులు, మధ్యవర్తుల చేతుల్లో నష్టపోకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలను ప్రారంభించిందన్నారు. అలాగే విక్రయించిన ధాన్యానికి ఎఫ్‌టీవో (ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్) రశీదును తప్పనిసరిగా పొందాలన్నారు. కేంద్ర ప్రభుత్వం సూచనల మేరకు ధాన్యం వాహనాల్లో ఎగుమతి చేసిన దగ్గర నుంచి రైసు మిల్లు వద్ద దిగుమతి అయ్యే వరకు జీపీఎస్ ట్రాక్ చేయబడుతుందన్నారు. రైతులు అమ్మదలిచిన ధాన్యాన్ని వాట్సాప్ ద్వారా షెడ్యూల్ చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, ఏడీఏ సీహెచ్.శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ గారపాటి రామచంద్రరావు, టీడీపీ నాయకులు గారపాటి శ్రీనివాసరావు, బేతిన నారాయణ, వ్యవసాయాధికారి ఎ.గంగాధరరావు పాల్గొన్నారు.

తుఫాన్ ఎఫెక్ట్.. ఘాట్లు బంద్



మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో మునిసిపల్ కమిషనర్ రాహుల్ మీనా ఆదేశాలతో రాజమహేంద్రవరంలోని పుష్కరఘాట్, లక్ష్మీగణపతి ఘాట్ తదితర గోదావరి ఘాట్లను అధికారులు సోమవారం తాత్కాలికంగా మూసివేశారు. భక్తులు ఎవ్వరూ ఘాట్లలోకి స్నానాలకు వెళ్లకుండా నియంత్రణ చర్యలు చేపట్టారు.

-రాజమహేంద్రవరం సిటీ.

రోజంతా వాన

- మొంథా తుఫాన్ నేపథ్యంలో ఎడతెరిపి లేని వర్షం
- స్థంభించిన జనజీవనం
- రాజమహేంద్రవరంలో అప్రమత్తమైన పారిశుధ్య విభాగం
- చెత్తచెదారాలు డంపింగ్ యార్డులకు తరలింపు



దివాన్‌చెరువు-లాలాచెరువు హైవేపై కురుస్తున్న వర్షం, రెయిన్‌కోట్‌తో స్కూటీపై వెళ్తున్న వ్యక్తి

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో ఎడతెరపిలేకుండా వర్షం పడుతోంది. సోమవారం ఉదయం ప్రారంభమై రాత్రి వరకు కొనసాగింది. దీంతో జనజీవనం స్థంభించింది. పనులు లేక వ్యవసాయ కూలీలు, కార్మికులు ఇళ్లకే పరిమితమయ్యారు. రాజమహేంద్రవరంలో మోస్తరుగా పడడంతో ఎప్పటి నీరు అప్పుడే డ్రైనేజీలలోకి చేరుకుంది. భారీ వర్షం పడితే నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడకుండా డ్రైనేజీలు,రోడ్లపై ఉన్న చెత్తను రెండు రోజులుగా డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. కమిషనర్ రాహుల్‌మీనా దీనికి సంబంధించి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో అధికారులు ఆయా పనుల్లో నిమగ్నమయ్యారు.

పారిశుధ్య విభాగం అప్రమత్తం

తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో నగరంలోని 50 డివిజన్లలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు, సిబ్బందిని అప్రమత్తం చేశారు. రహదారులు డ్రైనేజీల గుండా వర్షపు నీటి ప్రవాహానికి ఎటువంటి అడ్డంకులు లేకుండా పనులు చేస్తున్నారు. బలహీనంగా ఉన్న చెట్లు,వాటిని అనుకుని ఉన్న విద్యుత్ స్తంభాలు తదితర అంశాలపై ఇప్పటికే ఒక స్పష్టతకు అధికారులు వచ్చారు. ఇప్పటికే రాజమహేంద్రవరంలో 96 సచివాయల సిబ్బందికి కమిషనర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అందరు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు పరిస్థితిని పరిశీలించి సమాచారం ఇవ్వాలని సూచించారు. తుఫాన్ కాకినాడలో తీరం దాటే అవకాశం ఉన్నందున రాజమహేంద్రవరంలో భారీ వర్షాలు, ఈదురు గాలులు వీచే అవకాశం ఉండడం తో విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు.

రాజానగరంలో ముందస్తు చర్యలు



సిల్ట్‌ను డంపింగ్‌యార్డ్‌కు తరలిస్తున్న దృశ్యం

రాజానగరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో మండలంలో ముందుస్తు చర్యలు చేపట్టినట్టు తహశీల్దార్ జీఏఎల్ సత్యవతిదేవి తెలిపారు. దీనిలో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని తూర్పుగోనగూడెంలో ఎస్సీ కాలనీ ముంపు బారిన పడకుండా ఉండేలా హైవేను ఆనుకుని ఉన్న డ్రైన్‌లో పూడిక తీత పనులు చేపట్టామన్నారు. అధిక వర్షాలు సమయంలో జీఎస్ఎల్ సమీపంలో హైవేను ముంచెత్తుతున్న కన్నయ్య చెరువు పరిస్థితులను ఇప్పటికే పరిశీలించామన్నారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లోని పెద్ద చెరువుల నీటి సామర్థ్య పరిమాణాలపై ఆయా గ్రామాల్లోని వీఆర్వోలతో సమీక్షించామన్నారు. వీఆర్వోలు ఆయా గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించామన్నారు. మండల కేంద్రంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు.రాజానగరంలోని అన్నదాన సత్రం కల్యాణ మండపం, హైస్కూల్లో ముందుస్తుగా పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

పునరావాస కేంద్రాల పరిశీలన

బిక్కవోలు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను నేపథ్యంలో మండలంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సోమవారం తహశీల్దార్ సత్యకృష్ణ, ఎంపీడీవో శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు బిక్కవోలు, బలభద్రపురం, పందలపాక ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలను తనిఖీ చేశారు. వసతులన్నీ సక్రమంగా వున్నాయో? లేదో?, తాగునీరు, విద్యుత్, టాయిలెట్స్ సౌకర్యాలను పరిశీలించారు. వీరి వెంట ఎంఈవో సీహెచ్‌వీవీ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి పద్మజ, వీఆర్వో అశోక్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

అప్రమత్తమైన అధికారులు

అనపర్తి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో మండల అధికారులు అప్రమత్తమయ్యారు. ఎంపీడీవో రామకృష్ణారెడ్డి,తహశీల్దార్ అనిల్‌కుమార్ నేతృత్వంలో అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. లక్ష్మీనరసాపురంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఏర్పాటు చేసిన పునరావస కేంద్రాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. తాగు నీటి కొరత ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కొన్ని చోట్ల అత్య వసర పరిస్థితిలో వినియోగించేందుకు జనరేటర్లను కూడా సిద్ధం చేశారు. తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన తుఫాన్ సహాయక కేంద్రంలో అధికారులు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ అనిల్‌కుమార్ మాట్లాడు తూ గ్రామాల్లో కార్యదర్శులతో బాటు వీఆర్‌వోలు అందుబాటులో ఉంటారని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలిగినా సమాచారం అందించాలని కోరారు.అలాగే ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు అందుబాటులో ఉంటారని వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

ముందస్తు చర్యలు

గోకవరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. తహశీల్దారు రామకృష్ణ ఎప్పటికప్పుడు అన్ని గ్రామాల నుంచి సమాచారం సేకరిస్తున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు ఎక్కడా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఏఈ సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో సిబ్బంది కూలీలను ఏర్పాటు చేసుకొని 11కేవీ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను, తుప్పలను తొలగించారు. తెల్లవారుజాము వరకు వారికి కేటాయిం చిన గ్రామాల్లోనే సిబ్బంది ఉండేలా చర్యలు తీ సుకున్నారు. 6వేల హెక్టార్లలో వరి సాగు చేయగా 60 హెక్టార్లలో కోతలు పూర్తయ్యాయని వ్యవసాయాధికారి రాజేశ్వరి తెలిపారు.

శ్రీరంగపట్నంలో ఆర్డీవో పర్యటన

కోరుకొండ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరంగపట్నం పరిధిలోని లోతట్టు ప్రాంతాలను ఆర్డీవో కృష్ణనాయక్ పరిశీలించారు. అక్కడి పరిస్థితులను తెలుసుకొని, అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తదుపరి ప్రతిపాదిత రిహాబిలిటేషన్ సెంటర్‌ను పరిశీలించి, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయుట, శానిటేషన్, తాగునీటి వసతులు, ఇతర సౌకర్యాలపై సమయానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగాధికారులకు సూచనలు జారీ చేశారు.



శ్రీరంగపట్నంలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో కృష్ణనాయక్



తూర్పుగోనగూడెంలో డ్రైన్‌ను శుభ్రం చేయిస్తున్న తహశీల్దార్



బిక్కవోలు పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు



అచ్చుతాపురంలో చెట్లు కొమ్మలు నరుకుతున్న విద్యుత్ సిబ్బంది

అప్రమత్తంగా ఉండండి

ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

పలు శాఖల అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో ప్రమాదం పొంచి ఉందని అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. తుఫాన్ నేపథ్యంలో సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నియోజకవర్గస్థాయి అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు, తాగునీటికి ఇబ్బంది కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పెదపూడి మండలంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు.ప్రతి మండలంలోను పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని, అనపర్తి మండలం లక్ష్మీనరసాపురం సాంఘిక గురుకుల కళాశాలతో బాటు బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో పునారావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాలు ముంపు బారిన పడకుండా ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అన్ని శాఖల అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని, ఎక్కడా ప్రాణ నష్టం వాటిల్లకుండా క్షేత్ర స్థాయిలో జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే చెప్పారు. సహాయక చర్యల్లో కూటమి నాయకులు పాల్గొనాలని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలిగినా తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. సమావేశంలో అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రంగంపేట సర్వసభ్య సమావేశం

రంగంపేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యతిథిగా విచ్చేసి మాట్లాడారు.అన్ని గ్రామాల ప్రజలు,ప్రజాప్రతినిధులు, అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జీఎస్టీ 2.0 సంస్కరణల పట్ల ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలుపుతూ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. ఇదిలా ఉండగా కార్యాలయంలో రైతులకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై శనగవిత్తనాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. సమావేశంలో ఆత్మకమిటీ చైర్మన్ వెలుగుబంటి సత్తిబాబు, జడ్పీటీసీ పేపకాయల రాంబాబు, ఎంపీడీవో వీవీ సాయిబాబు, తహశీల్దార్ కె.అనసూయ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మండలంలో విద్యుత్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు.కొన్ని గ్రామాల్లో వాటర్ ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల నిర్మాణం, మంచినీరు సమస్యలను విన్నవించారు. సుభద్రంపేట, చంద్రేడు, ముకుందవరం గ్రామాల్లో శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని కోరారు. సుభద్రంపేటలో అంగన్‌వాడీ కేంద్రం బిల్డింగ్ నిర్మించాలని, ఈలకొలను గ్రామంలో డ్రైనేజీలను శుభ్రం చేయించాలని పారిశుధ్య పనులు చేపట్టాలని నాయకులు కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో ఆళ్ల గోవిందు, నీలపాల త్రిమూర్తులు, వెలుగుబంటి సత్తిబాబు, ఉద్దండ్రావు శ్రీనివాసరావు, గిరజాల సత్తిబాబు, సొసైటీ అధ్యక్షుడు గారపాటి రాంబాబు, పోతుల వెంకటరాజు పాల్గొన్నారు.

శివాలయాలకు పోటెత్తిన భక్తులు

- కార్తీక సోమవారం పూజలు
- పలుచోట్ల లక్ష బిల్వార్చనలు
- స్వామికి పంచామృత అభిషేకాలు



బిక్కవోలు గోలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తుల పూజలు

బిక్కవోలు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో మండలంలోని శివాలయాలన్నీ భక్తులతో పోటెత్తాయి. బిక్కవోలులోని గోలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామిని దర్శించడానికి ఉదయం నుంచి భక్తులు బారులు తీరారు. స్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి, లక్ష బిల్వార్చన, పార్వతి దేవికి లక్ష కుంకుమార్చన జరిపారు. కొంకుదురులోని బుడతల మామిడి వద్ద ఉన్న త్రిముఖ లింగేశ్వరునికి, ఊలపల్లిలోని అగస్త్యేశ్వరస్వామికి కూడా లక్ష బిల్వార్చనలు జరిపారు. బలభద్రపురంలోని శివాలయంలో ద్వాదశ జ్యోతిర్లింగాలను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

కడియం: కడియంలో మల్లేశ్వస్వామి, వీరవరంలో ఉమారామలింగేశ్వరస్వామి,దుళ్లలో అగస్త్యేశ్వరస్వామి, మాధవరాయుడుపాలెంలో శివాలయం, మురమండలో సోమేశ్వర స్వామి, జేగురుపాడులో నగరేశ్వర స్వామి, వేమగిరిలో విశ్వేశ్వరస్వామి, కడియపులంకలో అనంతేశ్వరస్వామి ఆలయాల్లో కార్తీక సోమవారం పూజలు వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి స్వామి వారికి పంచామృతాభిషేకాలు, అర్చనలు చేశారు. ఆలయాల వద్ద భక్తులకు ఏర్పాట్లు చేశారు.

దివాన్‌చెరువు: పాతతుంగపాడులోని రామలింగేశ్వరస్వామి ఆలయంతోపాటు దివాన్‌చెరువు, సంపత్‌నగరం గ్రామాల్లోని శివాలయాల్లో సోమవారం వేకువఝాము నుంచే ఆలయ ప్రాంగణాల్లో దీపాలు వెలిగిస్తూ ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి పంచామృత అభిషేకాలు, క్షీరాభిషేకాలు జరిపారు. భక్తులు దీపదానం చేశారు. కొంతమంది సోమవారం పగలంతా ఉపవాసదీక్ష చేసి నక్షత్ర దర్శనంతో దీక్షను విరమించారు.

రాజమహేంద్రవరం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ఆలయాలలో కార్తీక సోమవార పూజలు ఘనంగా జరిగాయి, తొర్రేడులోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు స్వామికి అభిషేకాలు నిర్వహించారు. దీపాలు వెలిగించారు. పెద్దఎత్తున భక్తులు స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ పెద్దలు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మద్దుకూరి వాసు, ప్రధాన అర్చకులు ఆంజనేయులు, భక్తులు పాల్గొన్నారు.



పాతతుంగపాడులో శివమాలధారుల పూజలు



కడియపులంకలో పూజలు చేస్తున్న భక్తులు

చెరువు గట్లు పటిష్టతకు చర్యలు



కొంతమూరులో ప్రొక్లెయినర్‌తో చెరువుకు గండి కొడుతున్న దృశ్యం

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. మండలంలోని పల్లపు ప్రాంతాలు, చెరువు ప్రాంతాలను మండల ప్రత్యేకాధికారి జ్యోతి తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, ఆర్‌ఐ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులతో కలిసి పరిశీలించారు. కొంతమూరు గ్రామం పరిధిలోని మర్ల చెరువు పూర్తిగా నిండిపోవడంతో గండి కొట్టి కొంతమేర నీటిని తరలించారు. కాతేరు గ్రామం పరిధిలోని రాముడు చెరువు ఆక్రమణలకు గురై గట్టు పటిష్టత తగ్గడంతో ఇసుక బస్తాలు వేసి గట్టు ఎత్తు నుపెంచారు. రాజవోలు గ్రామంలోని చెరువులో నీరు బయటకు పోయే తూరలు మూసుకుపోవడంతో వాటిని సరిచేసి ప్రొక్లెయినర్ సహాయంతో గట్టును ఎత్తు చేశారు.

53 హెక్టార్లలో నేలకొరిగిన వరి పంట

తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురవడంతో మండలం పరిధిలోని సుమారు 53 హెక్టార్లలో వరి పంట నేలకొరిగినట్టు వ్యవసాయాధికారి భీమారావు తెలిపారు. 1415 హెక్టార్లలో వరి పంట సాగు చేస్తుండగా 283 హెకార్టర్లలో కోతలు పూర్తయినట్టు తెలిపారు.

గోష్పాదక్షేత్రంలో భక్తుల పుణ్య స్నానాలు



కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

కొవ్వూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మొదటి సోమవారం గోదావరి తీరంలోని శైవ క్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. కార్తీకమాసం మొదటి సోమవారం కావడంతో పట్టణ, పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వేకువజాము నుంచి కొవ్వూరు గోష్పాదక్షేత్రానికి చేరుకుని గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. ప్రధాన స్నానఘట్టాల్లో ఉన్న శివలింగాలకు నదీ జలాలతో అభిషేకాలు చేశారు. మహిళలు అరటి డొప్పల్లో కార్తీక దీపాలు వెలిగించి గోదావరి నదిలో విడిచిపెట్టారు. క్షేత్రంలోని రావిచెట్టు, తులసికోట, సుందరేశ్వరస్వామి ఆలయంలోని ధ్వజస్తంభం, నందీశ్వరుని వద్ద మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు. సుందరేశ్వరస్వామిని దర్శించుకుని పంచామృత అభిషేకాలు నిర్వహించారు. పండితులకు సాలగ్రామ, దీప దానాలను సమర్పించారు. క్షేత్రంలోని ఆలయాలతో పాటు, కొవ్వూరు పట్టణ, మండలంలోని గ్రామాల్లోని శైవ క్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. క్షేత్రంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కడియపులంకలో అయ్యప్పస్వామి పడిపూజ



కడియపులంక: పడి పూజలో పాల్గొన్న అయ్యప్పభక్తులు

కడియం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కడియపులంకలో సత్యదేవా నర్సరీ రైతు పుల్లా రాజశేఖర్‌స్వామి మొదటి శబరిమల యాత్ర సందర్భంగా ఆదివారం రాత్రి శ్రీలక్ష్మీగణపతి హోమం, స్వామిఅయ్యప్ప లక్షబిల్వార్చన, పడిపూజా కార్యక్రమాలు నిర్వహించారు. గురుస్వాములు తాడాల వీరవెంకట్రావు, సత్తి వెంకటగిరి ఆధ్వర్యంలో ఉదయం లక్ష్మీగణపతి హోమం, సాయంత్రం అయ్యప్పస్వామికి లక్షబిల్వార్చన, అయ్యప్పస్వామికి 108 రకాల పుష్పాలతో పూజలు జరిగాయి. పూజల్లో పాల్గొన్న స్వాములకు పడి, బిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పుల్లా ఆంజనేయులు, పుల్లా వీరబాబు, పుల్లా వీరవెంకట్రావు, పుల్లా పెదసత్యనారాయణ, పుల్లా చినసత్యనారాయణ, పుల్లా వీర్రాజు, పుల్లా రామకృష్ణ పాల్గొన్నారు.

పుట్టపర్తి ఉత్సవాలకు రండి!

ఎమ్మెల్యే నల్లమిల్లికి బులుసు ఆహ్వానం



ఎమ్మెల్యే నల్లమిల్లికి ఆహ్వాన పత్రిక అందిస్తున్న దృశ్యం

రంగంపేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): భగవాన్ శ్రీసత్య సాయిబాబా శతవర్ష జయంతి సందర్భంగా వచ్చే నెల 13 నుంచి 25 వరకు పుట్టపర్తిలో నిర్వహించే ఉత్సవాలకు రావాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి శ్రీ సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు సోమవారం ఆహ్వాన పత్రికను అందించారు. ప్రధాని మోదీతోపాటు సుమారు 200 దేశాల నుంచి దాదాపు 15 లక్షల మంది భక్తులు హాజరవుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం జోనల్ కన్వీనర్ సీహెచ్ త్రిమూర్తులు, జిల్లా మహిళా సేవాదళ్ సయన్వయకర్త బిక్కిన రామలక్ష్మి, ఎల్.శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: తమ్మా
సూర్యమినీ	: ఓజీ
సూర్యప్యాలస్	: బైసన్
స్వామి	: తెలుసు కదా
అనుశ్రీ(సాయికృష్ణ)	: కె-ర్యాంప్
శివజ్యోతి	: డ్యూడ్
రాజా	: డ్యూడ్
ఊర్వశి	: సలార్
మేనక	: తమ్మా
రంభ	: విద్రోహి
అప్సర	: కాంతారా-1
అశోక	: డ్యూడ్
వీఎస్ మహల్(నామవరం)	: కె-ర్యాంప్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: డ్యూడ్
వెంకటసూర్య(కడియం)	: కె-ర్యాంప్
సత్యగౌరి (అనపర్తి)	: డ్యూడ్
సూర్యశ్రీ (అనపర్తి)	: కె-ర్యాంప్
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: డ్యూడ్
రామకృష్ణ(కోరుకొండ)	: కాంతారా-1
గీతాసినిమాస్ (సీతానగరం)	: కాంతారా-1
శ్రీనివాస (గోకవరం)	: కె-ర్యాంప్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: తెలుసు కదా
లలితామహల్(రంపచోడవరం)	: కె-ర్యాంప్
నవయుగ(చింతూరు)	: కె-ర్యాంప్





అంతటా వాన



రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో సోమవారం జిల్లావ్యాప్తంగా 19 మండలలో 15.1 సెం.మీ వర్షపాతం నమోదైంది. ఉదయం 8 నుంచి సాయంత్రం 5:30 గంటల మధ్య జిల్లాలో అత్యధికంగా రాజానగరంలో 15.8 మి.మీ వర్షం కురిసింది. బిక్కవోలు మండలంలో 14.4, పెరవలిలో 13.8, అనపర్తిలో 13.2, రంగంపేటలో 12.0, ఉండ్రాజవరంలో 10.4, రాజమహేంద్రవరం రూరల్‌లో 10.2, కడియంలో 9.2, నిడదవోలులో 8.2, కోరుకొండలో 7.8, కొవ్వూరులో 6.2, రాజమహేంద్రవరంలో 5.4, చాగల్లులో 5.2, గోకవరంలో 5.0, గోపాలపురంలో 4.2, సీతానగరంలో 3.2 ,నల్లజర్లలో 3.0, దేవరపల్లిలో 2.2, తాళ్ళపూడి లో 2.2 మి.మీల వర్షపాతం నమోదైంది. జి ల్లా మొత్తం వర్షపాతం 8.0 శాతంగా ఉంది.

హర హర మహాదేవ



రాజమహేంద్రవరం పుష్కరఘాట్‌లో భక్తులు

కడియపులంకలోని అనంతేశ్వరుడికి అభిషేకం

హరహర మహాదేవ శంభో శంకర అంటూ భక్తులు కొలిచారు.. కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా సోమవారం వేకువజామున 3 గంటల నుంచి గోదావరి రేవులకు భక్తజనం పోటెత్తారు.స్నానాలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. దీపాలను నదిలో విడిచి దీపదానాలు, శాలిగ్రామ, స్వయం పాక దానాలు చేశారు. - రాజమహేంద్రవరం సిటీ

మొత్తమొంథా.. అలజడి!




ముంచుకొస్తోంది : ఉప్పాడ కొత్తపల్లి వద్ద సముద్రం

ఉప్పాడ వద్ద కల్లోల తీరం..



సురక్షిత ప్రాంతాలకు : కాట్రేనికోన వద్ద మత్స్యకారుల తరలింపు



(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

మొంథా తుఫాన్ ముంచుకొస్తోంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో రెండు రోజులుగా కొనసాగుతున్న వాయుగుండం ఆదివారం అర్ధరాత్రి తర్వాత తుఫాన్‌గా బలపడింది. ఈ క్రమంలో ఉత్తర వాయువ్యంగా పయనించి నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ప్రవేశించింది. సోమవారం మధ్యాహ్నం సమయానికి కాకినాడకు 490 కి.మీ వద్ద తుఫాన్ కేంద్రీకృతమై ఉంది. సోమవారం ఉదయం నుంచి గంటకు 17 కి.మీ. వేగంతో ప్రయాణిస్తోంది. అదే వేగంతో పయనించి మంగళవారం సాయంత్రం లేదా రాత్రికి మచిలీపట్నం-విజయనగరం మధ్య కాకినాడ వద్ద తీరం దాటుతుందని భారతవాతావరణ శాఖ తెలిపింది. అయితే తీవ్ర తుఫాన్ కాకినాడ-యానాం మధ్య తీరం దాటే అవకాశం ఉందని ఇస్రో వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

ఈ రాత్రి గడిస్తే చాలు

1996 నవంబరు 6న రాత్రి ఒక్కసారిగా తుఫాన్ వచ్చింది.. కోనసీమను తుడిచిపెట్టేసింది.. మొంథా తుఫాన్ మంగళవారం రాత్రి కాకినాడ వద్ద తీరం దాటుతుందని అంచనా. దీంతో ఉమ్మడి జిల్లాలో ప్రతి ఒక్కరూ ఈ రాత్రి గడిస్తే చాలనుకుంటున్నారు..

గంటకు వేగం 100 కి.మీ..

గాలుల తీవ్రత మంగళవారం సాయంత్రానికి గంటకు 100 కిలోమీటర్ల వరకు ఉంటాయన్న హెచ్చరికలు ప్రజల్లో వణుకుపుట్టిస్తున్నాయి. మరో వైపు సోమవారం రాత్రి కాకినాడ పోర్టులో ఏడో నెంబరు ప్రమాద హెచ్చరిక ఎగుర వేశారు. హుద్‌హుద్ తుఫాన్ తర్వాత మళ్లీ ఆ స్థాయిలో ప్రమాద హెచ్చరికలు జారీ అవడం తుఫాన్ తీవ్రతను చాటుతోంది. సామర్లకోట,రాజమహేంద్రవరం మీదుగా వెళ్లే పలు రైళ్లను రద్దు చేశారు.రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి వెళ్లే పలు విమానాలు రద్దుచేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని బీచ్‌లకు వెళ్లే అన్ని రహదారులు మూసివేశారు.

సీఎం, డిప్యూటీ సీఎం సమీక్షలు..

ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా కాకినాడ, కోనసీమ జిల్లాల తీరప్రాంతాల్లో తుఫాన్ బీభత్సం అధికంగా ఉండనున్నందున ఈ ఇద్దరి కలెక్టర్లతో సీఎం చంద్రబాబు తరచూ సమీక్షలు నిర్వహిస్తు న్నారు. బాధితులకు ఏ ఇబ్బంది కలగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. కాకినాడ జిల్లాలో పునరావాస శిబిరాలకు వెళ్లినచోట ప్రజల ఇళ్లకు ఇబ్బందులు లేకుండా గస్తీ పెంచాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశించారు. అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు ప్రజలకు అందుబాటులో ఉండి సహాయక చర్యలు ముమ్మరం అయ్యేలా చూడాలని మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు.

రోజంతా ఒక్కటే వాన..

తుఫాన్ ప్రభావంతో సోమవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో పలు చోట్ల భారీ వర్షాలు పడగా.. రాత్రి నుంచి వర్షాల తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. తుఫాన్ మంగళవారం అర్ధరాత్రికి తీరం దాటనుండడంతో మంగళవారం నుంచి పెనుగాలులు అధికంగా ఉంటాయని ..అత్యవసరమైతే తప్ప ప్రజలెవరూ బయటకు రావొద్దని అధికారులు హెచ్చరించారు. తుఫాన్ ధాటికి చెరువులు, రిజర్వాయర్లు, కాలువలు పొంగిపొర్లుతున్నాయి. అనేక చోట్ల గండ్లు పడే ప్రమాదం ఉండడంతో జలవనరుల శాఖ అధికారులు ఇసుక బస్తాలు సిద్ధం చేశారు. విద్యుత్‌శాఖ విద్యుత్ సరఫరాలో అంతరాయాలను సరిదిద్దడానికి వీలుగా అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

దూసుకొస్తున్న తుఫాన్

- వణుకుతున్న ఉమ్మడి జిల్లాలు
- ఇప్పటికే భారీ వర్షాలు.. గాలులు
- అల్లకల్లోలంగా మారిన తీరం
- కాకినాడ - యానాం మధ్య హైఅలర్ట్
- తీరం దాటుతుందన్న సంకేతాలు
- పోర్టులో ఏడో నెంబరు హెచ్చరిక
- పలు రైళ్లు, విమానాలు రద్దు
- సీఎం, డిప్యూటీ సీఎం సమీక్షలు

కాకినాడలో 269 పునరావాస కేంద్రాలు

కాకినాడ జిల్లాలో 12 తుఫాన్ ప్రభావిత మండలాల్లో 269 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ స్వయంగా అధికారులతో కలిసి ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు.జిల్లాలో 3.35 లక్షల మందిపై తుఫాన్ ప్రభావం చూపుతుందని గుర్తించారు. నిత్యావసరాలు తగిన ప్రదేశాల్లో ఉంచేలా పౌరసరఫరాలశాఖ ఏర్పాట్లు చేసింది. విద్యుత్,ఫైర్ సిబ్బందిని అందుబాటులో ఉంచారు. కాకినాడ జిల్లాలో తుఫాన్ తీరం దాటుతుందన్న సమాచారంతో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నారాయణ సోమవారం అధికారులను అప్రమత్తం చేశారు.

కోనసీమలో 90 కి.మీ తీరం

కోనసీమ జిల్లాకు రెండు ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు చేరుకున్నాయి. తుఫాన్ సహాయక, పునరావాస చర్యలపై ప్రత్యేకాధికారిగా నియమితులైన విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మహేష్‌కుమార్, జేసీ నిషాంతి పరిశీలించారు. జిల్లా పరిధిలో సుమారు 90 కి.మీ తీర ప్రాంతం ఉండగా 120 పునరావాస కేంద్రాల్లోకి ఆరు వేల మందిని తరలించేలా ఏర్పాట్లు చేశారు. సఖినేటిపల్లి-నరసాపురం మధ్య పంటు రాకపోకలు నిలిపివేశారు.

తూర్పున యంత్రాగం అప్రమత్తం

తుఫాన్ హెచ్చరికలతో తూర్పుగోదావరి జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ఎస్‌డీఆర్ఎఫ్ బృందం జిల్లాకు చేరుకుంది. ముఖ్యంగా విపత్తు నిర్వహణ శాఖ, పోలీస్, రెవెన్యూ పునారావాస, భద్రత తదితర ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్ రాజమహేంద్రవరం చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మంత్రి దుర్గేష్ కంట్రోల్ రూమ్‌లను పరిశీలించారు. తుఫాన్ జిల్లా ప్రత్యేక అధికారిగా నియమించిన కె.కన్నబాబు నిడదవోలులో పర్యటించారు.

అధికారులు 24 గంటలు అందుబాటులో ఉండాలి

మంత్రి దుర్గేష్ ఆదేశం



మద్దూరు పునరావాస కేంద్రంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్ చిత్రంలో ఆర్‌డీవో రాణిసుస్మిత

నిడదవోలు/కొవ్వూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ దృష్ట్యా అధికారులు, గ్రామ సచివాలయాల సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలని మంత్రి దుర్గేష్ ఆదేశించారు. ముంబయి పర్యటన రద్దు చేసుకుని సోమవారం రాత్రి రాజమహేంద్రవరం ఎయిర్ పోర్టులో దిగిన మంత్రి దుర్గేష్ నేరుగా నిడదవోలు నియోజకవర్గానికి చేరుకుని ఉండ్రాజవరం, పెరవలి, నిడదవోలులో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లను పరిశీలించారు.కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. తుఫాన్ ఎదుర్కొనేందుకు యంత్రాంగం అన్ని విధాలా సిద్ధంగా ఉండాలన్నారు. ఆర్డీవో రాణి సుస్మిత నుంచి డివిజన్‌లోని 9 మండలాలకు సంభందించి వివరాలు అడిగితెలుసుకున్నారు. మద్దూరులో పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట తహశీల్దార్ బి.నాగరాజు నాయక్,ఎంపీడీవో జగన్నాథరావు పాల్గొన్నారు.



కంసాలిపాలెం వద్ద ఎర్రకాలువ పరీవాహక ప్రాంతాలను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేక అధికారి కన్నబాబు

సమన్వయంతో పని చేయండి

- తుఫాన్‌పై ఆందోళన వద్దు
- ఎక్కడైనా సమస్య ఉంటే చెప్పండి
- కంసాలిపాలెం దారి బంద్
- జిల్లా ప్రత్యేకాధికారి కన్నబాబు

నిడదవోలు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మొంథా తుఫాన్ ప్రభావం దృష్ట్యా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా సహాయక చర్యల ప్రత్యేక అధికారి ఏపీ సీఆర్‌డీఏ కమిషనర్ కె.కన్నబాబు ఆదేశించారు. నిడదవోలు మండలం కంసాలిపాలెం ఎర్రకాలువ పరివాహక ప్రాంతాన్ని సోమవారం పరిశీలించి మాట్లాడారు. తుఫాన్ సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. తుఫాన్ ప్రభావం తగ్గే వరకు సహాయక చర్యలు పర్యవేక్షిస్తామన్నారు. అధికార యంత్రాంగం 24 గంటలు పనిచేస్తుందన్నారు. ఎక్కడ సమస్యలు తలెత్తినా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఎర్రకాలువ ప్రవాహం ప్రస్తుతం పూర్తి నియంత్రణలోనే ఉందని ప్రజలు ఆందోళన చెందా ల్సిన అవసరం లేదన్నారు. మంత్రి కందుల దుర్గేష్ సూచనలతో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరితో సమన్వయం చేసుకుంటూ లోతట్టు,ఎర్రకాలువ పరిసర ప్రాంతాల్లో పర్యటించామన్నారు. ప్రస్తుతం 2 వేల క్యూసెక్కుల నీరు మాత్రమే ప్రవహిస్తుందన్నారు. ఎర్రకాలువ ప్రవాహ ఉధృతి కారణంగా తూర్పుగోదావరి జిల్లా కంసాలిపాలెం, పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం మాధవరం మధ్య ఉన్న రహదారి రాకపోకలు బంద్ చేశారు.ఆయన వెంటఆర్డీవో రాణి సుస్మిత, చైర్మన్ భూపతి ఆదినారాయణ,కమిషనర్ తోట కృష్ణవేణి ఉన్నారు.

ఏపీ స్టార్స్‌కు అనుమతుల్లో జాప్యం : రాహుల్

రాజమహేంద్రవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారడం, బడ్జెట్ పరిమితులు, సాంకేతిక అనుమతుల్లో జాప్యం కారణంగా ఏపీ స్టార్స్ నిర్మాణం తాత్కాలికంగా ఆగిపోయిందని సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ స్పష్టం చేశారు. 'ఏదీ ఏపీ స్టార్స్' శీర్షికన ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన కథనంపై ఆయన ఒక ప్రకటనలో స్పందించారు. అకాడమీ నిర్మాణానికి సమగ్ర ప్రణాళిక, ఆర్కిటెక్చర్ డిజైన్, ప్రభుత్వ ఆమోదం ప్రక్రియ జరుగుతోందన్నారు. సంబంధిత ఫైలు ఇంకా సమీక్ష దశలో ఉందనడం కొసమెరుపు. శిలాఫలకం వేసి ఈ నవంబరు 15కి రెండేళ్లు పూర్తవుతున్నా పనులు ఎప్పుడు ప్రారంభిస్తారనే విషయం రహస్యంగానే ఉంచారు.



భారీ హోర్డింగ్‌లు తొలగిస్తున్న పోలీసులు

రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్

మేం వచ్చేశాం.. భయపడొద్దు!

జిల్లాకు చేరుకున్న ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు

రాజమహేంద్రవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికలతో యంత్రాంగం అప్రమత్తమైంది. ఎస్‌డీఆర్ఎఫ్ బృందం జిల్లాకు చేరుకుంది. ముఖ్యంగా విపత్తు నిర్వహణ శాఖ, పోలీస్, రెవెన్యూ పునారావాస, భద్రత తదితర ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్ రాజమహేంద్రవరం చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. జిల్లాలోని భద్రత ఏర్పాట్లను ఎస్పీ నరసింహ కిశోర్ వివరించారు. పలు హోర్డింగ్‌లు, బ్యానర్లు, ఫ్లెక్సీలను తొలగించారు. పోలీస్ కంట్రోల్ రూమ్‌లో ప్రత్యేక బృందాల ద్వారా గమనిస్తున్నామన్నారు. పోలీస్ స్టేషన్ల పరిధిలో గస్తీ ముమ్మరం చేశామన్నారు. విపత్తు నిర్వహణ శాఖ 16 ప్రత్యేక బృందాలను, సరంజామాను సిద్ధం చేసింది. చెట్లు విరిగి రోడ్లపై పడితే వెంటనే కట్ చేయడానికి పవర్ రంపాలు అందుబాటులో ఉంచారు. ప్రాంతీయ ఫైర్ అధికారి ఈ.స్వామి కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాలోని పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. జిల్లాకు రాష్ట్ర విపత్తు నిర్వహణ దళం(ఎస్‌డీఆర్ఎఫ్) 33 మంది విపత్తు నిర్వహణకు అవసరమైన సామగ్రితో జిల్లాకు చేరుకుని రాజమహేంద్రవరం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో బస చేశారు. ఏ క్షణంలో అయినా జిల్లాలోని ఎక్కడికైనా వెళ్లడానికి వీలుగా వాహనాలతో సన్నద్ధంగా ఉన్నారు.అవసరమైతే లంకలు, లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తామని తహశీల్దార్ పాపారావు తెలిపారు. రైల్వే స్టేషన్‌లో రైళ్ల రద్దు సమాచారం అందించడానికి హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు.

అన్నదాత గుండెల్లో తుఫాన్!



- చివరికి అన్నదాతకు కష్టాలు
- మొంథా హెచ్చరికలతో ఆందోళన
- 8 మండలాల్లో వరి పంటకు నష్టం

(రాజమహేంద్రవరం/పెరవలి/రాజానగరం/ కడియం /గోకవరం -ఆంధ్రజ్యోతి)

ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తున్న అన్నదాతలకు ప్రకృతి వైపరీత్యాల భయం వెంటాడుతోంది. మరో వారం రోజుల్లో పంట కోత కోసి చేతికొస్తుందనుకొన్న తరుణంలో మొంథా తుఫాన్ హెచ్చరికలతో రైతులు దిక్కు తోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలతో పంట నేలకొరిగింది. దీంతో చాలా వరకు పంట గింజ పాలు పోసుకోక, తాలుగింజలు ఏర్పడే ప్రమాదం ఉందని, దీంతో పంట దిగుబడి తగ్గుతుందని రైతులు వాపోతున్నారు.ప్రతి ఏడాది ఏదో రీతిలో ప్రకృతి ప్రకోపానికి గురవుతున్నామంటూ అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. ఇప్పటి వరకూ 8 మండలాల్లో 545 మంది రైతులకు నష్టం వాటిల్లినట్టు సమాచారం. కడియం మండల వ్యవసాయాధికారి పీవీ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుతం 100 హెక్టార్లలో వరికోతకు పంట సిద్ధంగా ఉందని వర్షం తగ్గిన తరువాత పంట కోత కోసుకోవాలని రైతులకు సూచించారు. రాజానగరం మండలంలో 7 వేల ఎకరాల్లో వరి కోతలు కోయాల్సి ఉందని వ్యవసాయాధికారి ఎ.కళ్యాణ్ సూర్యకుమార్ తెలిపారు.. జిల్లావ్యాప్తంగా 1.62 లక్షల ఎకరాల్లో సాగు చేస్తున్న ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎన్.మల్లిఖార్జునరావు తెలిపారు.

తప్పని హర్రీ.. వర్రీ..

తూర్పుగోదావరి జిల్లాలో 52,929 హెక్టార్లలో వరి సాగు చేశారు.భారీ వర్షాల వల్ల ఇప్పటికే 12 మండలాల పరిధిలో 3569.2 హెక్టార్లలో పంట ఒరిగిపోయింది. ఇప్పటికే 105 గ్రామాల్లో 5207 మంది రైతులకు చెందిన 384.29 హెక్టార్లలో వరికి నష్టం వాటిల్లింది. ఇప్పటి వరకూ 4483 ఎకరాల్లో మాసూళ్లు పూర్తయ్యాయి. మాసూళ్లకు సిద్ధంగా 12,157 ఎకరాల పంట ఉంది. గింజ గట్టిపడే దశలో 1, 53,149 ఎకరాల్లో పంట ఉంది. ఇక పూత, భయాందోళన పరిస్థితిలో 21,751 ఎకరాలలో పంట ఉంది.భారీ వర్షాలు పడితే ఈపంటకు తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉంది.

పంట పడిపోతే.. నిలగట్టుకోవాలి : చల్లా



అనపర్తి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : వరి పంటను కాపాడుకునేందుకు రైతులు జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు సూచించారు. అనపర్తి ఏడీఏ కృష్ణతో కలిసి సోమవారం అనపర్తి, బిక్కవోలు మండలాల్లోని పలు గ్రామాల్లో పంటను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ప్రస్తుతం పంట ఎక్కువ శాతం గింజ తోడుకునే, గట్టిపడే పరిస్థితిలో పంట ఉందని ఈ దశలో బరువు ఎక్కువగా ఉండడంతో మొక్కలు కొద్దిపాటి గాలికే వెన్ను విరిగి నేలకు ఒరుగుతాయన్నారు.దీని వల్ల పిండి పదార్థం పూర్తిగా గింజలకు చేరక గింజ బరువు తగ్గడం లేదా తాలుగింజలు ఏర్పడి దిగుబడి తగ్గుతుందన్నారు.పడిన చేలలో ధాన్యం రంగు మారుతుందన్నారు.తుఫాన్ ముప్పు తొలగిన వెంటనే నీరు పోయే మార్గం ఏర్పాటు చేసుకుని.. పడిన పంట నిలగట్టుకోవాలని రైతులకు సూచించారు.ఐదు శాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని సూచించారు.

జిల్లా వ్యాప్తంగా నేలకొరిగింది..

- రాజమహేంద్రవరం మండల పరిధిలోని 7 గ్రామాలు రాజవోలు,బొమ్మూరు, ధవళేశ్వరం,హుకుంపేట,కోలమూరు, వెంకట నగర్,కాతేరు ప్రాంతాల్లో 63 మంది రైతులకు చెందిన 40 హెక్టార్లలో పంట ఒరిగిపోగా 5 హెక్టార్లలో నష్టం వాటిల్లింది.
- రాజానగరం మండలం ముక్కినాడ, రాజానగరం,నరేంద్రపురం,కలవచర్ల, జి.యర్రంపాలెం, పల్లకడియం, వెలుగుబంద, నామవరం,కొత్తతుంగపాడు, సం పత్‌నగర్ 11 గ్రామాల్లో 220 మంది రైతు లకు చెందిన 250 హెక్టార్ల పంట నేల కొరిగింది.
- కడియం మండలంలో కడియం,వేమగిరి, దుళ్ల, మురమండ, జేగురుపాడు గ్రామాల్లో 227 మంది రైతులకు చెందిన 145 హెక్టార్ల పంట నేల కొరిగింది.
- అనపర్తి 9 గ్రామాల్లో 256 మంది రైతులకు చెందిన 278 హెక్టార్లు నేల కొరిగింది.
- బిక్కవోలు 12 గ్రామాల్లో 2,200 మందికి చెందిన 1493 హెక్టార్లు నేలకొరిగింది.
- సీతానగరం 3 గ్రామాల్లో 68 మంది రైతులకు చెందిన 52 హెక్టార్లు నేలకొరి గింది.
- కొవ్వూరులోని 58 మందికి చెందిన 52 ఎకరాల పంట నేలకొరిగింది.
- తాళ్లపూడి 13 గ్రామాల్లో 286 మంది రైతుల పంట 161 హెక్టార్లు నేలకొరిగింది.
- నిడదవోలు 16 గ్రామాల్లో 850 రైతులకు చెందిన 400 హెక్టార్లు పంట నేలకొరిగింది.
- ఉండ్రాజవరం మండలం 8 గ్రామాల్లో 212 మంది రైతులకు చెందిన 121.2 హెక్టార్లు ఒరిగిపోగా 18.29 హెక్టార్లు దెబ్బతింది.
- పెరవలి మండలం 3 గ్రామాల్లో 38 మంది రైతుల 18 హెక్టార్ల పంటనేలకొరిగిపోగా 36 హెక్టార్లలో దెబ్బతింది.
- నల్లజర్ల మండలం 4 గ్రామాల్లో 70 మంది రైతులకు చెందిన 10 హెక్టార్ల పంట నీట ఒరిగిపోగా 110 హెక్టార్లలో నష్టపోయింది.
- రంగంపేట మండలం 114 గ్రామాల్లో 545 మంది రైతులకు చెందిన 94 హెక్టార్లలో పంట ఒరిగిపోయింది.

కానూరు జడ్పీ హైస్కూల్లో పునరావాస కేంద్రం

పెరవలి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కానూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌ను తుఫాన్ పునరావాస కేంద్రంగా జిల్లా కలెక్టర్ ప్రకటించారు. రానున్న 24 గంటల పాటు స్కూల్ సిబ్బందితో పాటు అధికారులు కూడా అందుబాటులో ఉంటారని పాఠశాల హెచ్ఎం విజయ కుమార్ తెలిపారు.



తుఫాన్ ప్రభావంతో ఎగసిపడుతున్న అలలు

ఎగసి పడుతున్న గోదావరి నది అలలు

కొవ్వూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో ఎప్పుడూ ప్రశాంతంగా ప్రవహించే గోదావరి నదిలో అలలు ఎగసి పడుతున్నాయి. సోమవారం ఉదయం నుంచి పట్టణం , మండలంలో ఆకాశం మేఘావృతమై భారీ వర్షం కురిసింది. దీంతో రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. అధికారుల హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు.

ఆందోళనలో రైతన్న



శింగవరంలో ఒరిగిపోయిన వరిచేను

నిడదవోలు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు పట్టణం, మండలంలో సుమారు 17,500 ఎకరాల్లో వరిని రైతులు పండించగా, ఇప్పటికే సుమారు 500 ఎకరాల్లో కోతలు పూర్తి అయ్యాయి. ఇంకా సుమారు 17 వేల ఎకరాల్లో వరిచేను కోతకు సిద్ధంగా ఉంది. ఈ సమయంలో మొంథా తుఫాను హెచ్చరికల నేపథ్యంలో రైతాంగం ఆందోళన చెందుతోంది.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

● జిల్లా ఉద్యానవన శాఖాధికారి



పంటలను పరిశీలిస్తున్న మల్లిఖార్జునరావు

కొవ్వూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మొంథా తఫాన్ నేపథ్యంలో అధిక వర్షాలపై రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి ఎస్.మల్లిఖార్జునరావు అన్నారు. సోమవారం కొవ్వూరు, దేవరపల్లి, పెరవలి, నిడదవోలు మండలాల్లో ఉద్యాన పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ఈయనతోపాటు కొవ్వూరు, దేవరపల్లి ఉద్యానవన శాఖ అధికారులు సుధీర్ కుమార్, జీ.రమేష్ పాల్గొన్నారు.

దివ్యాంగుల చదువుకు ఆర్థిక సాయం

కొవ్వూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : దొమ్మేరు ఆదరణ అంధుల ఆశ్రమ దివ్యాంగ విద్యార్థులకు రాజమహేంద్రవరానికి చెందిన విప్పర్ల హరనాథ్ వారి చదువు నిమిత్తం ప్రతినెలా రూ. నాలుగు వేలు ఆర్థికసాయం అందిస్తున్నట్టు ఆశ్రమ నిర్వాహకుడు అక్కాబత్తుల జాన్ తెలిపారు. హరనాథ్ భార్య ముత్యాంబ 13వ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం ఆశ్రమంలోని విద్యార్థులకు అన్నదానం చేశారు. గత ఆరు సంవత్సరాల మాదిరిగానే ఈ ఏడాదీ రూ. నాలుగు వేలు అందజేశారు. కార్యక్రమంలో విప్పర్ల భాను, కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

11 మంది జూదరుల అరెస్టు

దేవరపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): దుద్దుకూరులోని శ్రీనివాస స్టోన్‌క్రషర్స్‌లో పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 8,890 నగదు, ఐదు కార్లు, రెండు టేబుల్స్ 12 కుర్చీలు స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని ఎస్ఐ వీ.సుబ్రహ్మణ్యం తెలిపారు. దాడుల్లో ట్రైనింగ్ ఎస్ఐ దినేశ్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

లారీ బోల్తా.. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



హైవేపై బోల్తా పడిన లారీ

కొవ్వూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): లారీ బోల్తా పడిన ఘటనలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం మండలంలోని కాపవరం హైవేపై చోటు చేసుకుంది. నల్లగొండ నుంచి కాకినాడ వైపు సోనా మసూర్ బియ్యం లోడ్‌తో వెళ్తున్న 16 చక్రాల లారీ రోడ్డుపై అడ్డంగా బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నల్లగొండ జిల్లా దేవరకొండకు చెందిన లారీడ్రైవర్ పిల్లి శ్రీను తలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంతో హైవేపై ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. దీనిపై ఇప్పటి వరకు ఎటువంటి కేసు నమోదు కాలేదు.

తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలి

● అధికారులకు మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి ఆదేశం



మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రత్నకుమారి

కొవ్వూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో మొంథా తుఫాన్ ప్రభావంతో ఎటువంటి ప్రాణ, ఆస్తినష్టం సంభవించకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి ఆదేశించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ముందుగా పట్టణంలో చేపట్టిన, చేపట్టబోయే వివిధ అభివృద్ధి పనుల గురించి చర్చించారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ తుఫాన్ వల్ల ఏ సమస్య ఎదురైనా మున్సిపల్ కార్యాలయంలో గానీ, వార్డు సచివాలయ సిబ్బందికి గానీ సమాచారం అందజేయాలన్నారు. కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలో ప్రజల రక్షణార్థం అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. టీడీపీ ఫ్లోర్ లీడర్ సూరపనేని చిన్ని మాట్లాడుతూ తుఫాను ప్రభావంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్త చర్యగా పట్టణంలోని భారీ హోర్డింగ్స్ ఏర్పాటుచేసిన ఏజన్సీలు, భవన యజమానులకు నోటీసులు అందించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. బీజేపీ కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ మాట్లాడుతూ 1వ వార్డు రాజీవ్‌కాలనీలో తాగునీటి ఇబ్బందులను పరిష్కరించాలన్నారు. ఏతః సుమంత్ మాట్లాడుతూ రాజీవ్‌కాలనీకి వెళ్లే పైపులైను లీకేజీల కారణంగా కొంత ఇబ్బంది కలిగిందని, మరమ్మతులు చేపట్టడం జరిగిందన్నారు. అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర మాట్లాడుతూ రోడ్డు కం రైలు బ్రిడ్జి దిగువన ముంపు ప్రాంతంలో నివాసముంటున్న వారిని తుఫాన్ కారణంగా పునరావాస కేంద్రానికి తరలించాలన్నారు. కంటమణి రమేష్ బాబు మాట్లాడుతూ భారీ వర్షాల వల్ల విద్యుత్ అంతరాయంతో తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలన్నారు.

రైతులు కనీస మద్దతు ధర పొందాలి : ఎమ్మెల్యే



పశివేదలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతులు తను పండించిన ధాన్యాన్ని రైతుసేవా కేంద్రాల్లో విక్రయించి కనీస మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం పశివేదలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు దళారులు, మధ్యవర్తుల చేతుల్లో నష్టపోకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలను ప్రారంభించిందన్నారు. అలాగే విక్రయించిన ధాన్యానికి ఎఫ్‌టీవో (ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్) రశీదును తప్పనిసరిగా పొందాలన్నారు. కేంద్ర ప్రభుత్వం సూచనల మేరకు ధాన్యం వాహనాల్లో ఎగుమతి చేసిన దగ్గర నుంచి రైసు మిల్లు వద్ద దిగుమతి అయ్యే వరకు జీపీఎస్ ట్రాక్ చేయబడుతుందన్నారు. రైతులు అమ్మదలిచిన ధాన్యాన్ని వాట్సప్ ద్వారా షెడ్యూల్ చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో జిల్లా అగ్రికల్చరల్ అధికారి ఎస్.మాధవరావు, ఏడీఏ సీహెచ్.శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ గారపాటి రామచంద్రరావు, టీడీపీ నాయకులు గారపాటి శ్రీనివాసరావు, బేతిన నారాయణ, వ్యవసాయాధికారి ఏ.గంగాధరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణ నష్టం కలగకుండా చర్యలు

మొంథా తుఫాన్ ప్రభావంతో ప్రాణనష్టం కలగకుండా రాష్ట్రప్రభుత్వం అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే అన్నారు. సోమవారం వాడపల్లి, మద్దూరులంక, చిగురులంక, బంగారంపేట, పట్టణంలోని బ్రిడ్జిపేటలో పర్యటించారు. గోదావరి లంకలు, లోతట్టు ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలతో క్షేత్రస్థాయిలో మాట్లాడి అప్రమత్తం చేశారు. 100 కి.మీ పైగా ఈదురు గాలులు వీచే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న వారంతా ప్రభుత్వం ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కాకర్ల నారాయుడు, సూరపనేని చిన్ని, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, ఈవోఆర్డీ బీహెచ్ఎస్.ప్రకాశరావు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

చాగల్లు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం చంద్రవరంలో రైతు సేవా కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ రైతులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. మాధవరావు, ఏడీఏ చింతల శ్రీనివాసరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, సొసైటీ అధ్యక్షుడు మద్దిపాటి వీరరాఘవులు, సొసైటీ అధ్య క్షుడు బొల్లిన శివనాగేంద్ర, అబ్బూరి సీతారామాంజనేయులు, సర్పంచ్ ఎం. శ్రీరామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.



చంద్రవరంలో రైతు సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

తుఫాన్‌పై ముందస్తు జాగ్రత్త చర్యలు



ధాన్యం ఒబ్బిడి చేస్తున్న రైతులు

● నిత్యవసరాలు, తదితర వాటిని నిల్వ చేసుకుంటున్న జనాలు

పెరవలి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉంటుందని వార్తలు వస్తుండటంతో మండలంలోని ఆయా గ్రామాల ప్రజానీకం ఆందోళనలో ఉంది. దీంతో ముందు జాగ్రత్త చర్యగా నష్టాన్ని సాధ్యమైనంత తక్కువగా ఉంచడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యంగా రైతులు గత రెండు రోజుల నుంచి అరటి తోటల్లో వెదుళ్ల పాతడం, గట్లు వేయడం వంటి పనులు చేపడుతున్నారు. అలాగే పశువులు కలిగిన రైతులు ఎండు, పచ్చగడ్డి వంటి వాటిని అదనంగా కోసి నిల్వ చేసుకుంటున్నారు. పలువురు గృహిణిలు నీటి కొరత రాకుండా బకెట్లు, డబ్బాల్లో అదనంగా నీటిని నింపి నిల్వ చేసుకుంటున్నారు. కిరాణా షాపుల నుంచి కూరగాయల షాపుల వరకు సరుకులు కొనుగోలు చేసుకుని నాలుగైదు రోజుల పాటు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకుంటున్నారు. ఇప్పటికే పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో పిల్లలంతా ఇళ్ల వద్దనే కాలక్షేపం చేస్తున్నారు. ఇదిలా ఉండగా సోమవారం ఉదయం 10 గంటల నుంచి నెమ్మదిగా వర్షపు జల్లులు ప్రారంభమై... సాయంత్రం వరకు కురుస్తూనే ఉంది.

నిడదవోలు ఏఎంసీ చైర్మన్‌గా జిన్నాబాబు

● కమిటీ నియామక ఉత్తర్వులు జారీ



ఎన్నికైన చైర్మన్ గాలింకి జిన్నాబాబు

ఉండ్రాజవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) నూతన కమిటీని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో మార్కెట్ కమిటీ గౌరవ అధ్యక్షుడిగా రాష్ట్ర మంత్రి, నిడదవోలు ఎమ్మెల్యే కందుల దుర్గేష్, కమిటీ ఛైర్మన్‌గా ఉండ్రాజవరం మండలం చివటం గ్రామానికి చెందిన గాలింకి జిన్నాబాబు, వైస్ ఛైర్మన్‌గా పువ్వల రతీదేవి, సభ్యులుగా కోరశిక వెంకటేశ్వరరావు, మారిశెట్టి మీనాక్షి, నల్లూరి అరుణ, పోతాబత్తుల శ్రీనివాసరావు, వాకా సత్యనారాయణ, కడలిహేమలత, దిద్దే అరుణ కుమారి, దాసం సూర్య సుబ్రహ్మ ణ్యం, సంగీత పార్వతిదేవి, కాసకాని సతీష్, దేవళ్ల సత్యశైలజ, కారుమూరి శేషుబాబు, హనుమంతు వెంకన్నతోపాటు పెండ్యాల సొసైటీ ఛైర్మన్, కొవ్వూరు అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్, నిడదవోలు మునిసిపల్ ఛైర్మన్, జిల్లా అగ్రిట్రేడ్, మార్కెటింగ్ అధికారి సభ్యులుగా ఉంటారు. నూతన చైర్మన్ మాట్లాడుతూ మార్కెట్ కమిటీ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానన్నారు. దీంతో నియోజకవర్గానికి చెందిన పలువురు కూటమి నాయకులు, స్నేహితులు, తదితరులు అభినందనలు తెలిపారు.

భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు



గోష్పాదక్షేత్రంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

కొవ్వూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం మొదటి సోమవారం గోదావరి తీరంలోని శైవ క్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పట్టణ, పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వేకువజామునే కొవ్వూరు గోష్పాదక్షేత్రానికి చేరుకుని పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. ప్రధాన స్నానఘట్టాల్లోని శివలింగాలకు నదీ జలాలతో అభిషేకాలు చేశారు. మహిళలు అరటి డొప్పల్లో కార్తీక దీపాలు వెలిగించి గోదావరి నదిలో విడిచిపెట్టారు. క్షేత్రంలోని రావిచెట్టు, తులసికోట, సుందరేశ్వరస్వామి ఆలయంలోని ధ్వజస్తంభం, నందీశ్వరుని వద్ద మహిళలు కార్తీకదీపాలను వెలిగించారు. సుందరేశ్వరస్వామిని దర్శించుకుని పంచామృత అభిషేకాలు నిర్వహించారు. పండితులకు సాలగ్రామ, దీపదానాలను సమర్పించారు. క్షేత్రంలోని ఆలయాలతో పాటు కొవ్వూరు పట్టణ, మండలంలోని గ్రామాలలో శైవక్షేత్రాలన్నీ భక్తుల రద్దీతో కిటకిటలాడాయి. క్షేత్రంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నిడదవోలు: నిడదవోలు పట్టణంలోని గోదావరి నది పాయ అప్పారావు కాలువలో కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో సోమవారం తెల్లవారుజాము నుంచే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. అలాగే పట్టణంలో వేంచేసివున్న రాజరాజేశ్వరి సమేత గోలింగేశ్వరస్వామి ఆలయం, బాలా త్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి పంచాయతన క్షేత్రం భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి. ఈ సందర్భంగా మహిళలు ఉదయం నుంచి స్వామివార్లకు విశేష అభిషేకాలు నిర్వహించారు. భక్తులుపెద్దఎత్తున శివాలయాలకు పోటెత్తారు.

దేవరపల్లి: దేవరపల్లి శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆలయం వద్ద తెల్లవారుజాము నుంచి భక్తులు అధికసంఖ్యలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు అఖండం వీర వెంకటరాజు, సతీశ్‌కుమార్, వంశీకృష్ణ, దేవరభట్ల ప్రవీణ్‌శాస్త్రి పూజలు చేశారు.

ప్రభుత్వ భూమిని ప్రజాప్రయోజనాలకే వినియోగించాలి



తహశీల్దార్ కార్యాలయం వద్ద నాగేంద్ర, రాధా, తదితరులు

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర

తాళ్లపూడి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని ప్రజాప్రయోజనాలకే మాత్రమే వినియోగించాలని, అన్యమత ప్రచార సంఘాలకు కట్టబెడితే సహించేది లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, పరిమి రాధా హెచ్చరించారు. మండల బీజేపీ అధ్యక్షుడు ఇండుగుల రామకృష్ణ పిలుపు మేరకు సోమవారం బీజేపీ జిల్లా నాయకులు పోచవరానికి వచ్చారు. ఈ సందర్భంగా అన్యమతస్తులు వారి ట్రస్ట్ కోసం సేకరిస్తున్న కొండ ప్రాంత ప్రభుత్వ భూమి స్థలాన్ని బీజేపీ బృందం సందర్శించింది. అనంతరం వారు తహశీల్దార్ కార్యాలయం , పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి అధికారులను కలిసి ఈ విషయమై చర్చించారు. అనంతరం నాగేంద్ర మాట్లాడుతూ పోచవరం గ్రామ పంచాయతీ పరిధి సర్వేనెంబర్ 264లో కొండభూమి 25 సెంట్లలో మతపరమైన షెడ్డు కట్టడం జరిగిందన్నారు. కాగా, ఆ ట్రస్ట్‌కు కొంతస్థలం ఇచ్చారని చెప్పి అక్కడ ఉన్న చెట్లు నరికి తరలించారని, దీనిపై గతంలో తహశీల్దార్‌కు కూడా ఫిర్యాదు చేశానన్నారు. ఇకనైనా అధికారులు పరిశీలించాలని, లేని పక్షంలో బీజేపీ నేతలతోపాటు గ్రామస్థులతో కలిసి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బోడపాటి ముత్యాలరావు, కొమ్మిరెడ్డి శ్రీనివాసరావు, వెలుగుబంటి బాలకృష్ణ, గోకవరపు జితేంద్ర రవి, కొండేపాటి వెంకట సత్యనారాయణ, రామ్మూర్తి, కలిశెట్టి సన్యాసి నాయుడు, బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

కొవ్వూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్టు పట్టణ ఏఎస్ఐ జీ.శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని జగనన్నకాలనీ లేఅవుట్ - 3లో నివాసముంటున్న పెయింటర్ వల్లెపు పూర్ణచంద్ర (39) ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఈనెల 26వ తేదీన ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని అత్యవసర వైద్యం నిమిత్తం కాకినాడ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించినట్టు మృతుడి భార్య రత్నకుమారి పేర్కొన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

'మానవత' ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు

● సంస్థ అధ్యక్షుడు బండి సూర్య ప్రకాశ్‌రావు

దేవరపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతోందని ఆ సంస్థ అధ్యక్షుడు బండి సూర్యప్రకాశ్‌రావు పేర్కొన్నారు. సోమవారం కేసిరాజు సీతారామయ్య ఇంటి వద్ద సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సూర్యప్రకాశ్ మాట్లాడుతూ మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యత్వం రూ.600 చెల్లించి చందాదారులుగా చేరాలన్నారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో మానవత జిల్లా కన్వీనర్ కేసిరాజు వెంకట రాజ్‌కుమార్, కార్యదర్శి కే.నరేశ్‌వర్మ, ఉపాధ్యక్షుడు ఆచంట సుభాష్ చంద్రబోస్, కోశాధికారి తీగల లక్ష్మీనారాయణ, నలమాటి లలిత, ఆకుల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్‌పై ఆందోళన వద్దు : మంత్రి



ఉండ్రాజవరం తహశీల్దార్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

ఉండ్రాజవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్‌పై ప్రజలు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం ప్రజలకు బాసటగా నిలుస్తుందని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. సోమవారం రాత్రి ఉండ్రాజవరం తహశీల్దార్ కార్యాలయంలో తుఫాన్ ముందస్తు చర్యలపై అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కమాండ్ కంట్రోలు పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రతి ఏటా ఈ తరహా విపత్తులు సంభవిస్తూనే ఉన్నాయని, ప్రభుత్వం ముందుస్తు చర్యలు చేపట్టడం ద్వారా ప్రమాదాన్ని అరికడుతున్నట్లు చెప్పారు. అధికారులు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, అవసరమైన వైద్యసేవలు, భోజన, తాగునీరు అవసరాలు తీర్చడంలో పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని సూచించారు. చెట్లు పడిపోవడం, విద్యుత్ స్థంబాలు విరిగి పడటం వంటి సంఘటనలు జరిగిన వెంటనే పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలన్నారు. తుఫాను కంట్రోల్ రూములను పరిశీలించి, తగు సూచనలు చేశారు. అనంతరం పెరవలి తహశీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఎంపీడీవో ఎం. శ్రీనివాస్, టీడీపీ మండల అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు వీరమళ్ల బాలాజీ, ఇతర అధికారులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొంటాం'



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎస్ఎస్‌డీసీ చైర్మన్ శేషారావు



గుడ్డిగూడెం సమీపంలో ఇసుక బస్తాలు సిద్ధం చేస్తున్న యంత్రాంగం

గోపాలపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని తహశీల్దార్ సాయిప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన గోపాలపురంలో విలేఖర్లతో మాట్లాడుతూ పునరావాస కేంద్రాల్లో వైద్యశిబిరాలు, అవసరమైన వారికి భోజన ఏర్పాట్లు చేశామన్నారు. ఉద్యోగులతో పాటు జేసీబీ యంత్రాలు, క్రెయిన్స్ ట్రాక్టర్లు, విద్యుత్‌స్తంభాలు సమకూర్చు కున్నట్టు విద్యుత్‌శాఖ ఏడీఏ రవిశేఖర్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయాల వద్ద కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో రాజమనోహర్ తెలిపారు.

దేవరపల్లి: మొంథా తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్టు తహశీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. ఇప్పటికే మండలంలో 15 ప్రభుత్వ పాఠశాలల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కేంద్రాల్లో వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది ఉంటారన్నారు. వ్యవసాయ శాఖాధికారి కమలరాజు, ఉద్యానశాఖాధికారి రమేశ్ మాట్లాడుతూ గౌరీపట్నం, పల్లంట్ల, దేవరపల్లి, కృష్ణంపాలెం, దుద్దుకూరులో అరటి, కూరగాయ పంటలు రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏవో కమలరాజు మాట్లాడుతూ వరి కోతలు చేపట్టవద్దన్నారు.

తాళ్లపూడి : తుఫాన్ నేపథ్యంలో మండలంలోని ప్రజలంతా పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని తహశీల్దార్ లక్ష్మీలావణ్య పేర్కొన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ మంగళ, బుధ వారాల్లో బలమైన గాలులు వీయడం, వర్షాలు ఎక్కువగా ఉండే అవకాశం ఉందన్నారు.

ఉండ్రాజవరం: మొంథా తుఫాన్ తీవ్రత దృష్ట్యా ప్రజలను అప్రమత్తం చేయాలని ఏపీ స్కిల్ డవలప్‌మెంట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పేర్కొన్నారు. సోమవారం వేలివెన్నులో తుఫాన్‌పై నియోజకవర్గ కూటమి శ్రేణులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శేషారావు మాట్లాడుతూ గ్రామాల్లో ఎటువంటి పరిస్థితులు ఎదురైనా శ్రేణులంతా వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కూరగాయలు, పాలు, నీరు, కొవ్వొత్తులు వంటి నిత్యావసర వస్తువులు ముందుగానే నిల్వ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉండ్రాజవరం, నిడదవోలు, పెరవలి మండలాల టీడీపీ అధ్యక్షులు సింహాద్రి రామకృష్ణ, వెలగన సూర్యారావు, అతికాల శ్రీను, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు. అలాగే తుఫాన్ తీవ్రత దృష్ట్యా గ్రామాల్లో అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో మండలంలో 15 పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ప్రసాద్ మాట్లాడుతూ అన్ని విధాలా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు.

నల్లజర్ల: తుఫాన్ ప్రభావంపై అధికారులు అప్రమత్తమయ్యారు. తహశీల్దార్ ఎస్‌వీఎస్ నాయుడు ఆధ్వర్యంలో 17 గ్రామాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి అందే సమయంలో తుఫాన్ రావడంతో ఇప్పటికే పక్వానికి వచ్చిన పంట కింద పడి మొలకలు వచ్చే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో నాలుగు వేల హెక్టార్లలో వరి పంటను సాగు అవుతోంది. ప్రస్తుతం పంట కోతకు వచ్చింది. తుఫాన్ హెచ్చరికతో ముందుగా కొంత కోసినప్పటికీ సోమవారం నుంచి కోతలు నిలిపివేయడం జరిగింది.



దేవరపల్లిలో పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న తహశీల్దార్ శ్రీనివాస్